@vaartanews @mvnewstv

# మన వార్త

www.mivaartanews.com
TGBIL/25/A0512
AP EDITION

విజయవాడ
ఆదివారం 4 అక్టోబర్ 2026
ప్రతి అక్షరం... ప్రజల కోసం
సంపుటి : 2
సంచిక : 260
పేజీలు : 8 వెల : 5/-




తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న
మీ వార్తన్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను
ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్‌లు,
నియోజకవర్గాల వారీగా ఆర్‌సీ ఇంచార్జీలు,
మండలాల వారీగా విలేకరులు కావలెను.
సీనియర్లకు ప్రాధాన్యం
కొత్తవారికి అవకాశం ఉంటుంది

## వాయుసేనకు ప్రతి ఏటా 36- 40 విమానాలు అవసరం



- ఫైటర్ స్క్వాడ్రన్ల సంఖ్య తగ్గిపోవడంపై ఐఏఎఫ్ చీఫ్ ఏపీ సింగ్ ఆందోళన
- దేశ సైనిక బలం విషయంలో వాయుసేన చాలా కీలకమని వెల్లడి
- ఏఐ ద్వారా ఎయిర్‌ఫోర్స్‌ను బలోపేతం చేస్తామని ప్రకటన
- "అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ ఐదో తరం ఫైటర్ ప్రోగ్రామ్‌లో జాప్యం జరిగితే మనం ఇతర ప్రత్యామ్నాయాలకు మళ్లాల్సి ఉంటుంది.

# క్వాంటం వ్యాలీగా అమరావతి




- క్యూ-శివ, అమరావతి డిక్లరేషన్..
- పాన్ ఐఐటీ సమ్మిట్ లో కీలక ఘట్టాలను ఆవిష్కరించిన చంద్రబాబు
- డీప్‌టెక్ స్టార్టప్‌ల కోసం రూ.500 కోట్ల వెంచర్ ఫండ్ ఏర్పాటు
- అమరావతిలో శాశ్వత పాన్ ఐఐటీ కౌన్సిల్ ఏర్పాటుకు నిర్ణయం
- వచ్చే ఫిబ్రవరి నుంచి అమరావతిలో క్వాంటం కంప్యూటర్ ఆపరేషన్స్
- క్వాంటం వ్యాలీగా అమరావతిని తీర్చిదిద్దుతామన్న సీఎం చంద్రబాబు

**అమరావతి**

ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు సాంకేతిక ప్రగతికి, పెట్టుబడులకు కేంద్రంగా నిలవనుందనడానికి విజయవాడలో జరిగిన పాన్ ఐఐటీ అమరావతి సమ్మిట్ 2026 నిలువుటద్దం పట్టింది. ఈ సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి పలు కీలక ఘట్టాలు ఆవిష్కృతమయ్యాయి. డీప్‌టెక్నాలజీ అభివృద్ధికి ఊతమిచ్చేలా రూ.500 కోట్ల వెంచర్ ఫండ్ ఏర్పాటు చేస్తూ చారిత్రక 'అమరావతి డిక్లరేషన్' విడుదల చేయడంతో పాటు, "మేకిన్ అమరావతి" సంకల్పంతో - మిగతా3లో

## ఏపీ అన్ని రంగాల్లో అగ్రగామిగా ఉండాలనే విజన్‌తో ముందుకెళ్తున్నాం



- ఏ రంగంలోనైనా ఆంధ్రప్రదేశ్ నెంబర్ వన్‌గా ఉండాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం పని చేస్తోంది
- 23 క్లస్టర్స్‌లో అభివృద్ధి చెందిన దేశాలుగా అవతరించడానికి అమెరికా, యూరప్‌లకు వందేళ్ల పట్టింది
- దుబాయ్ 30 ఏళ్లు, సింగపూర్ 25 ఏళ్లలో అభివృద్ధి సాధించాయి
- వచ్చే పదేళ్లలో భారత్ కూడా ఆ స్థాయికి చేరుకుంటుంది
- ఐటీ శాఖ మంత్రి లోకేశ్



## అంతా బాగుందనుకుంటే ప్రమాదమే..

- రానున్న ఆర్థిక సవాళ్లపై ఆర్‌బీఐ గవర్నర్ వార్నింగ్
- ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెరుగుతోందన్న ఆర్‌బీఐ గవర్నర్
- ఆర్థిక ముప్పులపై ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్న మల్హోత్రా
- ప్రపంచ దేశాల మధ్య విభేదాలు పెరుగుతున్నాయని వెల్లడి
- వాణిజ్య ఆంక్షలు, సరఫరా సమస్యలు ప్రభావం చూపుతున్నాయని ప్రకటన
- ఆర్థిక సమస్యలు ఒక్కసారిగా బయటపడొచ్చని హెచ్చరిక

## పేదల కోసం మరో 3 లక్షల ఇళ్ల

# నిర్మాణానికి శ్రీకారం

- కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్‌తో కలిసి శంకుస్థాపన చేయనున్న సీఎం చంద్రబాబు
- దేశంలోనే తొలిసారిగా 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ ఇళ్ల ప్రాజెక్టుకు భూమిపూజ
- గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గంలో రేపు ఈ కార్యక్రమం
- గత 28 నెలల్లో ప్రభుత్వం 5.50 లక్షల ఇళ్లను లబ్ధిదారులకు అందించింది



**అమరావతి**

రాష్ట్రంలో పేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేస్తోంది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్ (గ్రాపీహ్-+) 2.0 పథకం కింద కేంద్ర ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన మూడు లక్షల ఇళ్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో కలిసి రేపు (అక్టోబరు 4) భూమిపూజ చేయనున్నారు. గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గంలోని బుర్రిపాలెం గ్రామంలో ఈ కార్యక్రమం జరగనుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 28 నెలల కాలంలో ఇప్పటికే 5.50 లక్షల ఇళ్లను లబ్ధిదారులకు అందించింది. గతేడాది నవంబరులో 3 లక్షలు, ఈ ఏడాది మార్చిలో 2.50 లక్షల ఇళ్లకు సామూహిక గృహ ప్రవేశాలు నిర్వహించిన ప్రభుత్వం, ఇప్పుడు మరో భారీ కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది. - మిగతా3లో



## అమరావతిలో గ్రామకంఠాల మినహాయింపులపై పునఃపరిశీలన

- మంత్రి నారాయణకు సీఎం ఆదేశం
- రాజధాని గ్రామాల్లో 2014-19 మధ్య ఇచ్చిన గ్రామకంఠాల మినహాయింపులు పునఃపరిశీలించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు
- నిబంధనల ప్రకారం గ్రామ కంఠాలను నిర్ధారించారా లేదా అనేది పరిశీలించాలని సీఎం ఆదేశాలు జారీ

**అమరావతి**

రాజధాని అమరావతి పరిధిలోని గ్రామకంఠాల అంశాన్ని పురపాలక శాఖ మంత్రి నారాయణ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. శుక్రవారం రాత్రి సీఎంతో సుదీర్ఘంగా చర్చించిన అనంతరం 2014-19లో గ్రామకంఠాలుగా గుర్తించి భూసమీకరణ నుంచి ఇచ్చిన మినహాయింపులను పునఃపరిశీలించాలని సీఎం ఆదేశించారు. నిబంధనల ప్రకారమే గ్రామకంఠాలను నిర్ధారించారా? మినహాయింపులు సక్రమంగా ఇచ్చారా? అనే అంశాలను పూర్తిస్థాయిలో పరిశీలించి నివేదికను సీఆర్డీఏ అథారిటీకి సమర్పించాలని సూచించారు. రాజధాని - మిగతా3లో

## ఆ ఎన్నికలన్నీ చట్టవిరుద్ధమే



- లోక్‌సభ, అసెంబ్లీలను రద్దు చేయాలి'
- కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే సంచలన డిమాండ్
- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సంచలన ఆరోపణలు
- దేశంలో అన్ని ఎన్నికలు చట్టవిరుద్ధంగానే నిర్వహిస్తున్నారని వ్యాఖ్యలు
- లోక్‌సభ, అసెంబ్లీలను రద్దు చేసి బ్యాలెట్ పేపర్ పద్ధతిలో మళ్లీ ఎన్నికలు జరపాలని డిమాండ్

## అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దు



- చివరి నిమిషంలో కీలక నిర్ణయం!
- తొలుత అక్టోబర్ 4న పర్యటనకు ఖరారైన షెడ్యూల్
- మెదక్, కరీంనగర్‌లో పర్యటనకు ఏర్పాట్లు పూర్తి
- షెడ్యూల్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- నిరాశలో బీజేపీ శ్రేణులు



## దేశవ్యాప్త నిరసనలను ఒకే వేదికపైకి తెచ్చేందుకు రాహుల్ శ్రీకారం

- 'సత్యాగ్రహ' డిజిటల్ ప్లాట్‌ఫామ్ ప్రారంభం
- కీలక నిర్ణయం తీసుకున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ
- దేశవ్యాప్త నిరసనలను ఒకే వేదికపైకి తెచ్చేందుకు సత్యగ్రహ డిజిటల్ ప్లాట్‌ఫామ్ స్టార్ట్
- ఒంటరిగా వినిపించే గొంతుక అణిచివేతకు గురవుతుంది : రాహుల్

మన వార్త
ప్రతి అక్షరం... ప్రజల కోసం



# 'ఆ ఎన్నికలన్నీ చట్టవిరుద్ధమే

'సర్' ప్రక్రియ కేంద్రంగా దేశంలో ప్రస్తుతం రాజకీయ పరిణామాలు హాట్ టాపిక్‌గా మారాయి. కేంద్ర ఎన్నికల సంఘంలో సభ్యుల మధ్య అభిప్రాయ భేదాల అంశం, సర్ ప్రక్రియలో అక్రమాల ఆరోపణల నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తాజాగా సంచలన ఆరోపణలు చేశారు. దేశంలో ప్రస్తుతం కొనసాగుతున్న ఎన్నికల ప్రక్రియపై మాట్లాడిన ఆయన– దేశంలో అన్ని ఎన్నికలు చట్టవిరుద్ధంగానే జరిగాయని ఆరోపించారు. ఈ క్రమంలో లోక్‌సభతో పాటుగా అన్ని రాష్ట్రాల అసెంబ్లీలను రద్దు చేసి మళ్లీ కొత్తగా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇదే సమయంలో ఈవీఎం పద్ధతిలో కాకుండా ఇప్పుడు బ్యాలెట్ పేపర్ విధానంలో ఎన్నికలు నిర్వహించాలని కోరారు. శనివారం రోజు కర్ణాటక కలబురగిలో విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ ప్రెసిడెంట్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ సహా కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రాష్ట్రాల ముఖ్యమంత్రుల ఎన్నికలపైనా ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. 'ప్రస్తుతం దేశమంతా చట్టవిరుద్ధంగా నిర్వహించే ఎన్నికల ఆధారంగానే నడుస్తోంది. మోదీ అక్రమంగా ఎన్నికైన ప్రధాని. అమిత్ షా చట్టవిరుద్ధంగానే ఎన్నికైన మంత్రి. ఎక్కడ ఎన్నికైన ముఖ్యమంత్రులైనా సరే, వారంతా ఇలానే చట్టవిరుద్ధంగా ఎన్నికైనవారే. వారందరినీ తొలగించి మళ్లీ ఎన్నికలు నిర్వహించాలి. ఆ ఎన్నికలను బ్యాలెట్ పేపర్ల ద్వారా నిర్వహించాలి.' దేశంలో ఎక్కడ ఎన్నికలు నిర్వహించినా ఈవీఎంల దుర్వినియోగం తీవ్ర స్థాయిలో జరుగుతుందని ఖర్గే మండిపడ్డారు. అధికార పార్టీకి చెందిన నేతలే స్వయంగా ఇది చెబుతున్నారని అన్నారు. అధికార బీజేపీ, ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు వార్డులు, పంచాయతీలు, గ్రామాలకు వెళ్లి ఎక్కువగా పేదలు, గిరిజనులు, దళితులు, మైనార్టీల ఓట్లను



కావాలని తొలగిస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. సెప్టెంబర్ 30న జరిగిన ఇండియా కూటమి సమావేశాన్ని కూడా ఖర్గే ఈ సందర్భంగా ప్రస్తావించారు. అక్కడ దాదాపు 20 పార్టీల ప్రతినిధులు, ఆయా పార్టీలకు చెందిన లీగల్ సెల్ ప్రతినిధులు పాల్గొనగా, సర్ ప్రక్రియ దేశానికి నష్టం కలిగించేలా సాగుతోందని ప్రతి ఒక్కరూ అంగీకరించినట్లు చెప్పారు.

సర్ ప్రక్రియలో పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని, ఇది ప్రజాస్వామ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోందని ఖర్గే వ్యాఖ్యానించారు. ప్రతి పోలింగ్ బూత్‌కు దాదాపు 500 ఓట్ల వరకు తొలగిస్తూ, తమకు అనుకూలమైన వారి పేర్లను కూడా చేరుస్తున్నారని ఖర్గే విమర్శించారు. ఇలా జరిగితే అది నిష్పక్షపాతంగా నిర్వహించిన ఎన్నిక ఎలా అవుతుందని ఖర్గే ప్రశ్నించారు. గతంలో ప్రధానులుగా పనిచేసిన జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి, పీవీ నరసింహారావు, రాజీవ్ గాంధీ కూడా ప్రజాస్వామ్యంలో ఇలాంటి చర్యలకు ఎన్నడూ పాల్పడలేదని చెప్పుకొచ్చారు. ఈ నేపథ్యంలోనే దేశంలో ఎన్నికల ప్రక్రియ, సర్ ప్రక్రియపై ప్రతిపక్షాల ఆందోళనలు కొనసాగుతాయని ఖర్గే తెలిపారు.

అక్టోబర్ 6న దిల్లీలో ప్రతిపక్ష పార్టీల ఎంపీలు ఎన్నికల సంఘం కార్యాలయానికి ర్యాలీ నిర్వహిస్తారని స్పష్టం చేశారు. ప్రజలకు అవగాహన కల్పించడానికి, ప్రతి 3-4 రోజులకు ఓసారి ప్రచారాలు, నిరసనలు నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు. 2023లో ప్రవేశపెట్టిన ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామక చట్టంపైనా ఖర్గే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల కమిషనర్ల ఎంపిక కమిటీ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తిని (జజీ×) తొలగించి ఆ స్థానంలో కేంద్ర మంత్రిని చేర్చడం ద్వారా తమకు అనుకూలమైన వ్యక్తులనే నియమించుకుంటున్నారని విమర్శించారు.

**జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయడమే తెలివైన పని: పి. చిదంబరం**

ఇక సర్ ప్రక్రియలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ చుట్టూ వివాదం మరింత ముదురుతోంది. ఈ క్రమంలో ఆయన రాజీనామా చేయడం మినహా మరో మార్గం లేదని కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి పి. చిదంబరం అన్నారు. ప్రతిపక్షాల ఒత్తిడి కారణంగా సీఈసీ ఏదో ఒక రోజు వైదొలగాల్సిందేనని, కాబట్టి తక్షణమే రాజీనామా చేయడమే తెలివైన నిర్ణయం అని స్పష్టం చేశారు. లేకపోతే తమ నిరసనలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. సర్ నిర్వహణలో ఎన్నికల కమిషనర్లకు చట్టవిరుద్ధమైన ఆదేశాలు ఇచ్చారని చిదంబరం మండిపడ్డారు. ప్రస్తుతం సీఈసీ రాజీనామాను డిమాండ్ చేస్తున్నామని, ఇతర కమిషనర్ల పాత్రపై అనుమానాలు వచ్చినా, ఆధారాలు లభించినా వారి రాజీనామాపై కూడా పోరాటం చేస్తామని తెలిపారు.

# వాయుసేనకు ప్రతి ఏటా 36- 40 విమానాలు అవసరం

దేశ సైనిక బలం విషయంలో వాయుసేన చాలా కీలకమని భారత వైమానికదళ అధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ తెలిపారు. దేశానికి ప్రతి ఏటా 36-40 విమానాలు అవసరమని అన్నారు. ప్రణాళిక ప్రకారం పనులు జరిగితే ఈ ఆర్థిక సంవత్సరంలోనే మల్టీరోల్ ఫైటర్ జెట్ ఒప్పందం ఖరారు కావొచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ధరల చర్చలు, ఇతర కీలక అంశాలపై ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయని వివరించారు. అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రోగ్రామ్‌లో జాప్యం జరిగితే వైమానిక దళం మరో ప్లాట్‌ఫామ్‌ను కొనుగోలు చేయాల్సి రావొచ్చని అభిప్రాయపడ్డారు. దిల్లీలో జరిగిన ఐఏఎఫ్ వార్షిక మీడియా సమావేశంలో ఏపీ ఏపీ సింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. "అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ ఐదో తరం ఫైటర్ ప్రోగ్రామ్‌లో జాప్యం జరిగితే మనం ఇతర ప్రత్యామ్నాయాలకు మళ్లాల్సి ఉంటుంది. రష్యా సు-57ను ప్రతిపాదించింది. కానీ దానిపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. సకాలంలో విమానాల అప్పగింత, కార్యాచరణ సామర్థ్యాన్ని నిర్ధరించడానికి అన్ని ప్రధాన విమాన ప్రోగ్రామ్‌లను 'సమగ్ర దేశ విధానం' ద్వారా చేపట్టాల్సిన అవసరం ఉంది. వాయుసేన వద్ద ఉన్న విమానాల సంఖ్యను పెంచుకోవాలనుకుంటున్నాం. ఐఏఎఫ్‌ను ఆధునీకరిస్తాం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా భారత వైమానిక దళాన్ని బలోపేతం చేస్తాం. ఏఐ ఆధారిత వాయుసేన ఉండాలి. మొత్తం పోరాట సంసిద్ధతకు రక్షణ రంగంలో స్వయం సమృద్ధి చాలా కీలకం"

**స్మిత్ మచ్చుర్‌పై ప్రశంసలు**

షైదుబాయ్ హీరో కెప్టెన్ స్మిత్ మచ్చుర్‌పై ఏపీ సింగ్



ప్రశంసలు కురిపించారు. విమానంలో స్మిత్ మచ్చుర్ అసాధారణమైన శారీరక, మానసిక ధైర్యాన్ని ప్రదర్శించారని కొనియాడారు. ప్రత్యేక డ్రోన్ దళాన్ని ఏర్పాటు చేయాలని తాము ఇంకా నిర్ణయించలేదని ప్రకటించారు. భారత వైమానిక దళం విషయంలో డ్రోన్లు అనేవి విప్లవాత్మక మార్పును తెచ్చేవి కావని, అవి క్రమంగా జరుగుతున్న పరిణామంలో భాగం మాత్రమేనని చెప్పారు. తాము డ్రోన్లు, లోయిటరింగ్ మ్యునిషన్స్ (లక్ష్యం వద్ద వేచి ఉండి దాడి చేయగల ఆయుధాలు) సంఖ్యను వైమానిక దళంలో పెంచుతున్నామని వివరించారు. వీటికి ప్రత్యేకమైన డ్రోన్ దళం అవసరమని తాను భావించడం లేదన్నారు. ఆధునిక సైనిక కార్యకలాపాల్లో మానవ రహిత వైమానిక వ్యవస్థలు (ఖూూ), లోయిటరింగ్ మ్యునిషన్స్ వినియోగం పెరుగుతున్న తరుణంలో ఐఏఎఫ్ చీఫ్ ఈ వ్యాఖ్యలు చేశారు.

"భారత వైమానిక దళానికి డ్రోన్లు విప్లవాత్మకం కాదు. అవి కేవలం పరిణామక్రమంలో వస్తున్న మార్పులు. ప్రత్యేక డ్రోన్ దళాన్ని ఏర్పాటు చేయం. డ్రోన్లు, లోటరింగ్ మ్యూనిషన్స్ విడివిడిగా కాకుండా ఇతర ఆయుధాలు, ప్లాట్‌ఫారమ్‌లతో కలిసి సమన్వయంగా పనిచేసినప్పుడే ఎక్కువ ప్రభావం చూపుతాయి. వైమానిక దళంలో డ్రోన్లు, లోయిటరింగ్ మ్యూనిషన్స్ సంఖ్యను పెంచుతున్నాం. వాయుసేనకు ప్రత్యేక డ్రోన్ దళం అవసరం లేదు. అవి ఒకే వ్యవస్థలో భాగంగా ఉండాలి. వాయుసేనలో డ్రోన్ సామర్థ్యాలు గత కొన్నేళ్లుగా ఉన్నాయి. ప్రస్తుతం వాటి సంఖ్యను, రకాలను, సామర్థ్యాలను మాత్రమే విస్తరిస్తున్నాం. ప్రత్యేక డ్రోన్ దళం కంటే ప్రస్తుత వాయుసేన వ్యవస్థలోనే డ్రోన్లు భాగం కావాలని, అప్పుడే సమష్టిగా ఆపరేషన్లు నిర్వహించడం సాధ్యమవుతుంది" అని తెలిపారు.

**నీట్ యూజీ రీ-టెస్ట్ గురించి ఏమన్నారంటే?**

నీట్ యూజీ రీ-టెస్ట్‌కు సంబంధించిన ప్రశ్నపత్రాలను చేరవేసే బాధ్యతను ఐఏఎఫ్ చేపట్టడంపైనా ఏపీ సింగ్ స్పందించారు. ఏదైనా ప్రక్రియలో మనం (ఐఏఎఫ్) సాయం అవసరమైతే తప్పకుండా చేయాలని అన్నారు. ఆ పని ఏమిటన్నది ముఖ్యం కాదన్నారు. కాగా, జూన్ 21న జరిగిన నీట్ యూజీ రీ-టెస్ట్‌కు సంబంధించిన రవాణా, ఇతర నిర్వహణ బాధ్యతలను భారత వైమానిక దళం చేపట్టింది. ఈ క్రమంలో ఐఏఎఫ్ చీఫ్ ఏపీ సింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. "భారత వైమానిక దళం వద్ద ఉన్న విమానాల సంఖ్య తగ్గుతోంది. ప్రణాళికాబద్ధమైన విమానాల చేర్పులలో జాప్యం ఐఏఎఫ్‌ను ప్రభావితం చేసింది. ప్రస్తుత, ఊహించిన అంతరాలను పూడ్చడానికి ఐఏఎఫ్ తేజస్ మార్క్-1ఏ, మల్టీ రోల్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ (వీ=ఖీూ), ఫ్యూచర్ మార్క్-2 ఫైటర్ వంటి ప్లాట్‌ఫారమ్‌ల వైపునకు చూస్తోంది" అని ఏపీ సింగ్ పేర్కొన్నారు.

# దేశవ్యాప్త నిరసనలను ఒకే వేదికపైకి తెచ్చేందుకు రాహుల్ శ్రీకారం

దేశవ్యాప్తంగా జరుగుతున్న నిరసనలను ఒకే వేదికపైకి తెచ్చి, వాటికి మద్దతు కూడగట్టే లక్ష్యంతో రూపొందించిన 'సత్యాగ్రహ' అనే డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ శనివారం ప్రారంభించారు. దేశంలో వివిధ రకాల అన్యాయాలపై పోరాడుతున్న పౌరులు తమ పోరాట గాథలను, నిరసనల వివరాలను ఈ వేదిక ద్వారా పంచుకోవాలని కోరారు. అలాగే జాతిపిత మహాత్మా గాంధీ సిద్ధాంతాన్ని ప్రస్తావించారు. సత్యాగ్రహం అనేది ఒక శక్తివంతమైన ఆయుధమని అభివర్ణించారు. అయితే సత్యం వైపు ఐక్యంగా నిలబడటం అంతకంటే గొప్ప ఆయుధమని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో రాహుల్ పోస్ట్ పెట్టారు. దేశవ్యాప్తంగా ప్రజలు తమ హక్కుల కోసం పోరాడుతున్నారని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. "తరచుగా ప్రజలు తమకు జరిగిన అన్యాయం, హక్కులపై ఒంటరిగానే పోరాడుతున్నారు. జెన్‌జీ (యువత), విద్యార్థులు, రైతులు, గిరిజనులు, దళితులు, మహిళల ప్రతి పోరాటానికి ఒక ప్రత్యేకమైన కథ ఉంది. అయితే ఒంటరిగా వినిపించే గొంతుక తరచుగా అణచివేతకు గురవుతుంది. ఈ గొంతుకలన్నింటినీ ఒక మ్యాప్‌పై ఏకం చేసే ప్రయత్నమే 'సత్యాగ్రహ' డిజిటల్ ప్లాట్‌ఫామ్. సత్యమే అంతిమ ఆయుధమని బాపు (మహాత్మా గాంధీ) మనకు బోధించారు. కానీ సత్యం కోసం ఐక్యంగా నిలబడటమే అంతకంటే గొప్ప ఆయుధం" అని రాహుల్ పేర్కొన్నారు.

**'రెండు నిమిషాలు కేటాయించండి చాలు'**

"మీరు (దేశ ప్రజలనుద్దేశించి) కూడా ఏదైనా అన్యాయంపై పోరాడుతుంటే మీ పోరాట గాథను పంచుకోండి. అందుకు కేవలం రెండు నిమిషాల సమయమే పడుతుంది. నిరసనకారులు తమ పోరాటానికి గల కారణాలు ఈ



ప్లాట్‌ఫామ్‌లో సమర్పించవచ్చు. ఇంటరాక్టివ్ మ్యాప్ ద్వారా దేశవ్యాప్తంగా జరుగుతున్న ఇలాంటి ఉద్యమాలను గుర్తించవచ్చు. ప్రజల ప్రత్యక్ష మద్దతును పొందొచ్చు. మీ పోరాట గాథ మ్యాప్‌లో కనిపిస్తుంది. మీలాగే ఇంకా ఎవరు అన్యాయంపై పోరాడుతున్నారో మీరు చూడొచ్చు. అన్యాయాలపై, ప్రజా హక్కులపై ప్రతిపక్ష నాయకుడిగా పార్లమెంట్‌లో, దేశ వీధుల్లో, లేఖలు రాయడం ద్వారా పోరాటం చేస్తాను. ప్రజలకు అండగా నిలిచేందుకు కృషి చేస్తాను. అది నా బాధ్యత."

**నిరసనల సమాచారమంతా ఒకే చోట : రాహుల్ గాంధీ**

దేశవ్యాప్తంగా ద్రవ్యోల్బణం, రైతుల సమస్యలు, మహిళల భద్రత వంటి వివిధ అంశాలపై జరుగుతున్న నిరసనల నేపథ్యంలో సామాన్య ప్రజల కోసం సత్యాగ్రహ వెబ్‌సైట్‌ను రూపొందించినట్లు రాహుల్ గాంధీ తెలిపారు. దేశంలోని ప్రతి మూలన నిరసనలు జరుగుతున్నాయని ఆరోపించారు. కొందరు విద్యార్థుల గురించి, మరికొందరు మహిళల గురించి, ఇంకొందరు ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా నిరసనలు తెలుపుతున్నారని అన్నారు. ఇలా దేశవ్యాప్తంగా లక్షలాది రకాల నిరసనలు జరుగుతున్నాయని మండిపడ్డారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడిగా ఈ నిరసనలన్నింటికి సంబంధించిన సమాచారాన్ని ఒకే చోట క్రోడీకరించాలని తాను భావించానని చెప్పారు. అందుకే నిరసనలు తెలుపుతున్న ప్రజల కోసం సత్యాగ్రహ వెబ్‌సైట్‌ను ప్రారంభించానని చెప్పారు. ప్రజల నిరసన ఏదైనా అది దేని గురించో సంబంధించిన వివరాలను ఈ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని పిలుపునిచ్చారు.

**కేంద్రంపై రాహుల్ ఫైర్**

శుక్రవారం నాడు ఎస్ఐఆర్ ప్రక్రియ, సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు రాహుల్ గాంధీ. జ్ఞానేశ్ కుమార్ త్వరగానే వెళ్లిపోతారని, ఆయనను ఆ పదవిలో కూర్చోబెట్టిన వ్యవస్థ కూడా వెళ్లిపోతుందని వ్యాఖ్యానించారు. వేలాది మంది యువత ఓట్ చోరీకి వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసేందుకే రోడ్లపైకి వచ్చారని తెలిపారు. వారు తమ రాజ్యాంగ హక్కులను వినియోగించుకుంటున్నారని పేర్కొన్నారు. కానీ నరేంద్ర మోదీ– అమిత్ షా ప్రభుత్వం ఏం చేస్తుంది? అబ్బాయిలు, అమ్మాయిల్ని వీధుల నుంచి ఈడ్చుకెళ్తోందని మండిపడ్డారు. ఓట్ చోరీపై ప్రశ్నించడమే యువత చేసిన నేరమా? అని ప్రశ్నించారు.

## అంతా బాగుందనుకుంటే ప్రమాదమే..



ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు. ప్రపంచ దేశాల మధ్య విభేదాలు, వాణిజ్య ఆంక్షలు, సరఫరా సమస్యలు, సాంకేతిక మార్పులు, వాతావరణ మార్పులు ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయని చెప్పారు. ఈ పరిస్థితుల్లో ఆర్థిక ముప్పుల విషయంలో ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కోవిడ్ తర్వాత ప్రపంచం ఎన్నో ఆర్థిక, ఇతర సంక్షోభాలను ఎదుర్కొందని మల్హోత్రా తెలిపారు. అయినా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వాటిని తట్టుకుని నిలబడిందన్నారు. భారత్‌లోనూ చాలాకాలంగా ఆర్థిక పరిస్థితులు స్థిరంగా ఉన్నాయని చెప్పారు. అయితే ఇదే స్థిరత్వం మరో సమస్యకు దారి తీయొచ్చని ఆయన హెచ్చరించారు. చాలాకాలం ఎలాంటి పెద్ద సంక్షోభం రాకపోతే గతంలో ఎదురైన సమస్యలను ప్రజలు, సంస్థలు మర్చిపోతారని అన్నారు. దీంతో ఎక్కువ రిస్క్ తీసుకోవడం, భారీగా అప్పులు చేయడం పెరిగే అవకాశం ఉందని చెప్పారు.

**ఒక్కసారిగా సమస్యలు రావొచ్చు**

బ్యాంకింగ్, ఆర్థిక రంగాల్లో సమస్యలు ఒక్కసారిగా బయటపడే అవకాశం ఉందని మల్హోత్రా తెలిపారు. అయితే వాటిని పూర్తిగా పరిష్కరించడానికి మాత్రం చాలా సమయం పడుతుందని చెప్పారు. అందుకే పరిస్థితులు బాగున్న సమయంలోనే జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను గతంలో నడిపించిన విధానాల్లో ఇప్పుడు మార్పులు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. దేశాల మధ్య రాజకీయ, ఆర్థిక విభేదాలు పెరుగుతున్నాయని చెప్పారు. వాణిజ్య ఆంక్షలు, సరఫరా అంతరాయాలు కూడా తరచూ ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ మార్పులన్నీ ఒకదానితో ఒకటి కలిసి ప్రభావం చూపుతున్నాయని మల్హోత్రా అన్నారు. అందువల్ల కేంద్ర బ్యాంకులు కేవలం ద్రవ్యోల్బణం, ఆర్థిక స్థిరత్వంపైనే దృష్టి పెట్టకుండా ప్రపంచ పరిణామాలను కూడా గమనించాలని సూచించారు.

## అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దు

కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దయింది. ఒక రోజు పర్యటన నిమిత్తం రేపు ఆయన రాష్ట్రానికి రావాల్సి ఉండగా.. చివరి నిమిషంలో కార్యక్రమాన్ని రద్దు చేసుకున్నారు. దానికి గల కారణాలేంటో అధికారికంగా వెల్లడికాలేదు. షెడ్యూల్ ప్రకారం అమిత్ షా నేటి రాత్రి 9 గంటలకు ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయానికి చేరుకుని, లోక్‌భవన్‌లో బస చేయాల్సి ఉంది. ఆదివారం ఉదయం మెదక్, కరీంనగర్ జిల్లాల్లో ఆయన పర్యటిస్తారని.. పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడంతో పాటు ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటారని షెడ్యూల్ లో పేర్కొన్నారు. హోంమంత్రి పర్యటన కోసం మెదక్, కరీంనగర్ జిల్లాల యంత్రాంగం ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది. పోలీసులు కూడా భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. అయితే పర్యటన రద్దుకు గల కారణం మాత్రం ఇంకా స్పష్టంగా తెలియలేదు. ఢిల్లీలో అత్యవసర పరిణామాలు లేదా ఇతర అనివార్య కారణాల వల్లే పర్యటన రద్దయి ఉండొచ్చని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పర్యటన రద్దుతో బీజేపీ శ్రేణుల్లో నిరాశ నెలకొంది. అమిత్ షా తెలంగాణకు ఎప్పుడు వస్తారనే విషయాన్ని త్వరలో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

## మమతా బెనర్జీకి మరో షాక్

**రెండు పార్లమెంటరీ కమిటీల ఛైర్మన్ పదవులను కోల్పోయిన టీఎంసీ**



బంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీకి వరుస షాక్‌లు తగులుతున్నాయి. పార్టీలో చీలిక, అగ్రనేతలపై దాడులు, అలాగే కీలక నేతల రాజీనామాలతో సతమతమవుతున్న తృణమూల్‌కు తాజాగా మరో ఎదురుదెబ్బ తగిలింది. రెండు కీలక పార్లమెంటరీ కమిటీల ఛైర్మన్ పదవులను తృణమూల్ కాంగ్రెస్ కోల్పోయింది. రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా శనివారం నాడు వివిధ శాఖలకు సంబంధించిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలను పునర్వ్యవస్థీకరించడంతో ఈ ఎదురుదెబ్బ మమతా పార్టీకి తగిలింది. వాణిజ్య వ్యవహారాల పార్లమెంటరీ కమిటీ ఛైర్మన్‌గా టీఎంసీకి చెందిన డోలా సేన్ స్థానంలో బీజేపీ నేత సుధాన్షు త్రివేది నియమితులయ్యారు. అలాగే రసాయనాలు, ఎరువుల కమిటీ ఛైర్మన్‌గా టీఎంసీలోని అసమ్మతి వర్గానికి చెందిన కకోలి ఘోష్ దస్తీదార్ ఎంపికయ్యారు. టీఎంసీ నేత కీర్తి ఆజాద్ స్థానంలో ఆమె బాధ్యతలు చేపట్టారు. పరిశ్రమల కమిటీకి తిరుచి శివ (డీఎంకే), ఆహారం, వినియోగదారుల వ్యవహారాలు, ప్రజా పంపిణీ కమిటీకి కె. కనిమొళి (డీఎంకే) మరోసారి ఛైర్మన్లుగా నియమితులయ్యారు. బీజేపీ మిత్రపక్షాలైన జేడీయూ, శివసేన, తెదేపాలకు చెందిన నాయకులు కూడా వివిధ పార్లమెంటరీ కమిటీల అధిపతులుగా కొనసాగుతున్నారు.

**కమిటీలకు ఛైర్మన్లుగా కాంగ్రెస్ సీనియర్ నేతలు**

కాంగ్రెస్ సీనియర్ నేత శశి థరూర్ విదేశీ వ్యవహారాల కమిటీ ఛైర్మన్‌గా, మరో అగ్రనాయకుడు చరణ్‌జిత్ సింగ్ చన్నీ వ్యవసాయ కమిటీ ఛైర్మన్‌గా కొనసాగుతున్నారు. విద్య, మహిళలు, పిల్లలు, యువజన వ్యవహారాల కమిటీకి హస్తం పార్టీ నాయకుడు ముకుల్ వాస్నిక్, అలాగే ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ కమిటీకి సమాజ్‌వాదీ పార్టీ నేత రామ్ గోపాల్ వర్మ ఛైర్మన్లుగా ఉన్నారు. రక్షణ శాఖ కమిటీకి బీజేపీకి చెందిన రాధా మోహన్ సింగ్ నేతృత్వం వహిస్తున్నారు. రవాణా, టూరిజం, సాంస్కృతిక కమిటీ ఛైర్మన్‌గా జేడీయూకి చెందిన సంజయ్ కుమార్ ఝా తిరిగి నియమితులయ్యారు. ఇంధన శాఖ కమిటీ అధిపతిగా శివసేనకు చెందిన శ్రీరంగ బర్నే కొనసాగుతున్నారు. ప్రజా ఫిర్యాదులు, న్యాయం, చట్టం కమిటీ ఛైర్మన్‌గా కమలం పార్టీ నాయకుడు సుజీత్ కుమార్ నియమితులయ్యారు. గతంలో ఈ కమిటీ ఛైర్మన్‌గా బీజేపీ ఎంపీ బ్రిజ్ లాల్ ఉండేవారు. బొగ్గు, గనులు, ఉక్కు శాఖ కమిటీ అధిపతిగా మాజీ కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ తిరిగి నియమితులయ్యారు. జలవనరుల కమిటీ ఛైర్మన్‌గా బీజేపీకి చెందిన రాజీవ్ ప్రతాప్ రూడీ కొనసాగుతున్నారు. కమలం పార్టీ నేత భర్తృహరి మహతాబ్ ఆర్థిక వ్యవహారాల కమిటీకి అధిపతిగా కొనసాగుతుండగా, అదే పార్టీకి చెందిన రాధా మోహన్ దాస్ అగర్వాల్‌ను హోం వ్యవహారాల కమిటీ ఛైర్మన్‌గా కొనసాగుతున్నారు. బీజేపీ సీనియర్ నేత నిశికాంత్ దూబేకు సమాచార ప్రసార, సాంకేతికత కమిటీ అధిపతిగా మరోసారి అవకాశం దక్కింది. మేధా విశ్రామ్ కులకర్ణిని సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం, అటవీ, వాతావరణ మార్పుల కమిటీ ఛైర్‌పర్సన్‌గా మరోసారి అవకాశం కల్పించారు. రైల్వే కమిటీ ఛైర్‌పర్సన్‌గా సీఎం రమేశ్ స్థానంలో బీజేపీకి చెందిన సుధీర్ గుప్తా బాధ్యతలు చేపట్టారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ కమిటీ అధిపతిగా కాంగ్రెస్‌కు చెందిన సప్తగిరి శంకర్ ఉలక తిరిగి నియమితులయ్యారు. ఈ ఏడాదికి గానూ పార్లమెంటరీ స్థాయీ కమిటీలను రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా పునర్వ్యవస్థీకరించారు. ప్రతి కమిటీలోనూ లోక్‌సభ నుంచి 21 మంది, రాజ్యసభ నుంచి 10 మంది సభ్యులు ఉంటారు. పలు కమిటీలలో ఇంకా కొన్ని ఖాళీలు ఉన్నాయి. రక్షణ కమిటీలో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో విపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సభ్యుడిగా ఉన్నారు. హోం వ్యవహారాల కమిటీలో ప్రియాంక గాంధీ వాద్రా సభ్యురాలిగా ఉన్నారు.

**సుప్రీంకోర్టుకెక్కిన టీఎంసీ పేరు, గుర్తు వివాదం**

మరోవైపు, బంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్‌లోని రెండు వర్గాల మధ్య కొనసాగుతున్న పార్టీ పేరు, గుర్తు వివాదం ఇటీవలే సుప్రీంకోర్టుకు చేరింది. ఈ క్రమంలో దేశ అత్యున్నత న్యాయస్థానం కీలక ఆదేశాలను ఇచ్చింది. ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ పేరు, పూలు-గడ్డి గుర్తు ఎవరికి చెందాలన్న విషయాన్ని ఎన్నికల సంఘం నిర్ణయించాల్సి ఉందని తెలిపింది. ఆ ప్రక్రియను ఆలస్యం చేయకుండా పూర్తి చేసేందుకు ఈసీకి సుప్రీంకోర్టు కాలపరిమితిని కూడా విధించింది. టీఎంసీ పేరు, గుర్తుపై ఉన్న వివాదానికి సంబంధించి ఎన్నికల సంఘం ముందు ఇరు వర్గాలు తమ వాదనలు వినిపించాలని, అవసరమైన పత్రాలను అందించాలని సూచించింది. అందుకోసం నాలుగు వారాల గడువునిచ్చింది. టీఎంసీ ఇరు వర్గాలు తమ వాదనలు పూర్తి చేసిన తర్వాత ఎన్నికల సంఘం మూడు నెలల్లోగా తుది నిర్ణయం తీసుకోవాలని పేర్కొంది.

# క్వాంటం వ్యాలీగా అమరావతి



-మొదటిపేజీ తరువాయి
రూపొందించిన ఐదు "క్యూ-శివ" క్వాంటం కంప్యూటర్లను సీఎం ఆవిష్కరించారు. క్యూబిట్ ఫోర్స్ సంస్థ, చండీఘడ్ యూనివర్సిటీ సంయుక్తంగా అభివృద్ధి చేసిన ఈ క్యూ-శివ కంప్యూటర్లు మినీ టెస్టింగ్ క్వాంటం ల్యాబ్‌లుగా పనిచేస్తాయి. వీటితో పాటు 4 కెల్విన్ ప్రాసెసర్ 'సృష్టి'ని కూడా ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా క్యూబిట్ సంస్థ సీఈఓ వెంకటసుబ్రమణ్యం మాట్లాడుతూ.. ఈ కంప్యూటర్ల తయారీకి అవసరమైన కొన్ని కీలక కాంపోనెంట్లు ప్రపంచంలో ఒకటి రెండు చోట్ల మాత్రమే లభిస్తాయని, అలాంటివి మన మచిలీపట్నంలో దొరకడం విశేషమని తెలిపారు. తమ ప్రయత్నానికి సీఎం చంద్రబాబు అందించిన సహకారం మరువలేనిదని ఆయన పేర్కొన్నారు. అనంతరం క్యూబిట్ ప్రతినిధుల కృషిని అభినందించిన ముఖ్యమంత్రి, వారితో కలిసి సెల్ఫీ దిగి ఉత్సాహపరిచారు.

**అమరావతి డిక్లరేషన్.. డీప్‌టెక్‌కు ఊతం**

ఈ సదస్సులో ఏపీ ప్రభుత్వం, పాన్ ఐఐటీ అలుమ్ని ప్రతినిధులు సంతకాలు చేసిన 'అమరావతి డిక్లరేషన్' ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీని ప్రకారం, అమరావతిలో ఏపీ ప్రభుత్వం-పాన్ ఐఐటీ అలుమ్ని ఇండియా ఆధ్వర్యంలో ఒక శాశ్వత కౌన్సిల్ ఏర్పాటు కానుంది. డీప్‌టెక్ స్టార్టప్‌లు, ఆవిష్కరణలు, పెట్టుబడులను ప్రోత్సహించేందుకు రూ.500 కోట్ల పాన్ ఐఐటీ అమరావతి వెంచర్ ఫండ్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ కౌన్సిల్ ద్వారా రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, పరిశ్రమలు, స్టార్టప్‌లను సమన్వయం చేస్తారు. రాష్ట్రంలోని విద్యా సంస్థల్లో 10 ఇండస్ట్రీ చైర్స్ ఏర్పాటు చేయడం, 100 మంది గ్లోబల్ ఐఐటీ మెంటర్లతో స్టార్టప్‌లకు మార్గనిర్దేశం చేయడం, 23 ఐఐటీల నుంచి టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ వంటివి ఈ డిక్లరేషన్‌లోని ముఖ్యాంశాలు. క్వాంటమ్-ఏఐ, సెమీకండక్టర్లు, స్పేస్-డిఫెన్స్ వంటి రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించి, 2030 నాటికి కనీసం 50 స్టార్టప్‌లను ఇంక్యుబేట్ చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించారు.

**క్వాంటం వ్యాలీగా అమరావతి: సీఎం చంద్రబాబు**

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. "గతంలో ఐటీని ప్రోత్సహిస్తే ప్రపంచవ్యాప్తంగా మన తెలుగువారు నిపుణులుగా ఎదిగారు. ఇప్పుడిక సిలికాన్ వ్యాలీ గురించి కాదు, అమరావతిలోని క్వాంటం వ్యాలీ గురించి ప్రపంచం చర్చించుకుంటుంది" అని ధీమా వ్యక్తం చేశారు. గతంలో తాను విజన్ 2020 తీసుకువచ్చినప్పుడు కొందరు '420' అంటూ హేళన చేశారని, కానీ దాని ద్వారానే విద్యుత్, రహదారుల వంటి రంగాల్లో సంస్కరణలు వచ్చాయని గుర్తుచేశారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో పయనిస్తోందని, 2047 నాటికి భారత్ ప్రపంచంలోనే అగ్రగామి ఆర్థిక వ్యవస్థగా ఎదగడాన్ని ఎవరూ ఆపలేరని అన్నారు. జాతి నిర్మాణంలో భాగమైన ఐఐటీయన్లు వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఐబీఎం-టీసీఎస్, ఎల్ అండ్ టీ సంయుక్తంగా ఏర్పాటు చేయనున్న క్వాంటం కంప్యూటర్ ఆపరేషన్స్ వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి అమరావతి నుంచే ప్రారంభమవుతాయని చంద్రబాబు ప్రకటించారు. భవిష్యత్తులో కేవలం వినియోగించుకోవడమే కాకుండా, క్వాంటం కంప్యూటర్లను తయారు చేసి ఎగుమతి చేసే స్థాయికి ఆంధ్రప్రదేశ్ చేరుకుంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఏపీ అన్ని రంగాల్లో అగ్రగామిగా ఉండాలనే విజన్‌తో ముందుకెళ్తున్నాం

ప్రపంచానికి భారత్ మోడల్‌ను చూపిద్దామని అది అమరావతి నుంచే వస్తుందని ఐటీ శాఖ మంత్రి లోకేశ్ అన్నారు. ఆ సామర్థ్యం మనకు ఉందనే విషయాన్ని ప్రపంచంతో పాటు దేశంలోని యువతకూ చెబుదామని లోకేశ్ తెలిపారు. ఆవిష్కరణలు, సాంకేతిక అభివృద్ధికి ఊతమిచ్చేలా విజయవాడలో నిర్వహించిన పాన్? ఐఐటీ ఆంధ్రప్రదేశ్ సదస్సును ఆయన ప్రారంభించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళావేదికలో జరిగిన కార్యక్రమంలో పాన్? ఐఐటీయన్స్, ఐఐటీ డైరెక్టర్లు, కార్పొరేట్ సీఈవోలు, యూనికార్న్ సంస్థల వ్యవస్థాపకులు, పెట్టుబడిదారులు, ఐటీ నిపుణులు, విధాన నిర్ణేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ ఏ రంగంలోనైనా ఆంధ్రప్రదేశ్ నెంబర్ వన్‌గా ఉండాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. 23 క్లస్టర్స్‌లో అభివృద్ధి చెందిన దేశాలుగా అవతరించడానికి అమెరికా, యూరప్‌లకు వందేళ్లు పట్టిందని లోకేశ్ తెలిపారు. దుబాయ్ 30 ఏళ్లు, సింగపూర్ 25 ఏళ్లలో అభివృద్ధి సాధించాయని పేర్కొన్నారు. వచ్చే పదేళ్లలో భారత్ కూడా ఆ స్థాయికి చేరుకుంటుందన్నారు. ఆ ప్రయాణంలో ఆంధ్రప్రదేశ్ అందరికన్నా ముందుంటుందని చెప్పారు.

'త్రీ ఎస్'తో ముందుకు: స్పీడ్, సర్వీస్, స్టెబిలిటీ అనే 'త్రీ ఎస్' మంత్రంతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళు తున్నామని తెలిపారు. పారిశ్రామికవేత్తలు ఏపీ వైపు చూసేలా



ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేశామని, ఒప్పందాలు చేసుకోవడంతో పాటు పరిశ్రమలు వాస్తవంగా ఏర్పాటయ్యేలా ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. సంస్కరణలను ప్రకటించడం మాత్రమే కాకుండా వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేయడం ముఖ్యమన్నారు. వ్యవసాయం, ఉద్యానవన రంగాలకు సమాన ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు.

"ఏపీ అన్ని రంగాల్లో అగ్రగామిగా ఉండాలనే విజన్‌తో ముందుకెళ్తున్నాం. మరో పదేళ్లలో భారత్ అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలుస్తుంది. అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ కీలకపాత్ర పోషిస్తుంది. పారిశ్రామికవేత్తలంతా ఏపీ వైపు చూసేలా ఎకో సిస్టం అభివృద్ధి చేశాం. ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధికి ఎన్నో అవకాశాలు ఉన్నాయి. స్థిరమైన పాలనతోనే అభివృద్ధి సాధ్యమని బలంగా నమ్ముతున్నాం" – లోకేశ్, మంత్రి

డీప్‌టెక్‌కు రూ.500 కోట్ల నిధి: అమరావతి కేంద్రంగా శాశ్వత ప్రాతిపదికన పాన్ ఐఐటీ కౌన్సిల్ ఏర్పాటు చేయనున్నట్లు సదస్సులో వెల్లడించారు. డీప్‌టెక్ స్టార్టప్‌లు, ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు రూ.500 కోట్లతో పాన్ ఐఐటీ ఆంధ్రా ఫండ్ ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో 100 ఇండస్ట్రీ రీసెర్చ్ ఛైర్స్, 100 మది సభ్యులతో గ్లోబల్ ఐఐటీ మెంటార్ నెట్‌వర్క్ ఏర్పాటుకు చర్యలు చేపట్టనున్నారు. క్వాంటమ్ కంప్యూటింగ్, స్పేస్, ఏరోస్పేస్, డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్, హెల్త్‌కేర్, అగ్రిటెక్, నీటి భద్రత తదితర అంశాలపై సదస్సులో చర్చలు జరిగాయి. చంద్రబాబు 4.0 ఆపరేటింగ్ సిస్టమ్‌కు యంగ్ అండ్ డైనమిక్ హార్డ్‌వేర్ తోడైందని లోకేశ్ వ్యాఖ్యానించారు. ప్రతి 100 రోజులకు అమరావతి నిర్మాణంలో పురోగతి కనిపిస్తోందని తెలిపారు. పాన్? ఐఐటీ సదస్సుకు హాజరైన ప్రతినిధులు అమరావతి నిర్మాణ పనులను పరిశీలించాలని కోరారు. ప్రపంచస్థాయి ప్రమాణాలతో అంతర్జాతీయ విమానాశ్రయం కూడా అందుబాటులోకి రానుందని వెల్లడించారు. దేశంలోని 23 ఐఐటీల పూర్వ విద్యార్థులు అమరావతి వేదికగా కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు.

# వైసీపీ ఓటు షేరు ఎందుకు తగ్గింది

**విజయవాడ :** ఏపీలో స్థానిక ఎన్నికలు త్వరలో జరగబోతున్నాయి. ఈ నేపథ్యంలో ఎవరి లెక్కల్లో వారు ఉన్నారు. సీట్ల సర్దుబాటు.. ఇతర వ్యవహారాలు జోరుగా సాగుతున్నాయి. సహజంగా కూటమిలో పోటీ అధికంగా ఉంది. వైసీపీలో పోటీ చేయడానికి ఎవరూ ముందుకు రావడంలేదని వాదనలు ఉన్నాయి. ఇలా సాగుతున్న రాజకీయ వ్యవహారంలో చాణక్య సంస్థ సర్వే నిర్వహించింది. ఈ సర్వే ప్రకారం 2024 తర్వాత 4.37 ఓట్ షేర్ ను వైసిపి కోల్పోయింది.. టిడిపి తో పోల్చితే దాదాపు 11.90 శాతం తేడా ఓటు బ్యాంకు కనిపిస్తోంది. ఎమ్మెల్యేలలో లోకేష్ టాప్ లో ఉన్నారు. 175 నియోజకవర్గాలలో 52, 500 మంది ఓటర్లను పరిశీలించారు. రెండు నెలలపాటు సర్వే నిర్వహించారు. అయితే కూటమి బలం తగ్గడం కాదు కదా.. భారీగా పెరిగింది. 2024 లో జరిగిన ఎన్నికలతో పోల్చి చూస్తే చాణక్య సర్వే చెప్పిన దాని ప్రకారం చూస్తే.. టిడిపి ఓటు బ్యాంకు 45. 60% నుంచి 46.90 శాతానికి పెరిగింది. మొత్తంగా ఓటు బ్యాంకు 1.30 శాతానికి పెరిగింది. వైసీపీకి 2024 ఎన్నికల్లో 39.37 ఓటు బ్యాంకు లభించింది. ఇప్పటికి అది 35% పడిపోయింది. జనసేనకు నాడు ఓటు బ్యాంకు 8.53 శాతం గా ఉంది. ఇప్పుడు అది తొమ్మిది శాతానికి చేరుకుంది. మొత్తంగా 0.47 ఓటు శాతం పెరిగింది. బిజెపికి 2.83 శాతం ఉండగా.. ఇప్పుడు అది 3.5 జీరోకి జరిగింది. మొత్తంగా 0.67 శాతం ఓటు బ్యాంకు పెరిగింది. ఇక ఇతరులు 3.67 నుంచి 5.60 వరకు శాతాన్ని పెంచుకున్నారు. మొత్తంగా మూడు పార్టీల ఓటు షేర్ దాదాపు 57% నుంచి 59.4 శాతానికి చేరుకుంది. అధికారులకు వచ్చిన తర్వాత ఓటు బదిలీ మరింత బలపడింది. 4.37 పాయింట్ల ఫలితమే ఈ సర్వేలో అతిపెద్ద మార్పు. ఓటు షేర్ 35% పడిపోయింది. రఫ్ఫా రఫ్ఫా నినాదాలు మాత్రమే చెబుతున్న వైసిపి నాయకులు.. ప్రజా సమస్యలను పట్టించుకోకపోవడం వల్లే ఈ సమస్య ఎదురయిందని విశ్లేషకులు అంటున్నారు. ఇప్పటికైనా పకడ్బందీగా వ్యవహరించకపోతే 35 శాతం ఓటు బ్యాంక్ కూడా తగ్గిపోతుందని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ గణాంకాలు చూస్తే వైసిపి కోల్పోవడం కష్టంగానే కనిపిస్తోంది. వైసిపి కోల్పోయిన ఓట్లలో కొంత భాగం ఇతరుల వైపు వెళ్ళింది. అటు కూటమి.. ఇటు వైసీపీ మీద అసంతృప్తితో ఉన్నవారు కాంగ్రెస్ లాంటి ప్రత్యామ్నాయాల వైపు చూస్తున్నారు. ఎమ్మెల్యేలలో లోకేష్.. కోటం.. పవన్ కళ్యాణ్ వరుసగా టాప్ మూడు స్థానాలలో ఉన్నారు. ఇక వైసిపి ఎమ్మెల్యేలలో చివరికి జగన్ తో ఎవరూ పెద్దగా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. బెంగళూరు నుంచి వచ్చిన తర్వాత మాత్రమే జగన్ పులివెందులలో హడావిడి చేస్తున్నారని.. ఆ తర్వాత జనాల బాధలను పట్టించుకునేవారు లేరని సర్వేలో తేలింది. మంత్రులుగా ఉన్నప్పటికీ పవన్ కళ్యాణ్ పిఠాపురం విషయంలో.. లోకేష్ మంగళగిరి విషయంలో మరింత దూకుడు ప్రదర్శిస్తున్నారని తెలుస్తోంది. చంద్రబాబు అయితే కుప్పం విషయంలో వారానికి రెండు రోజులు సమయం కేటాయిస్తున్నారని.. ముఖ్యమంత్రిగా ప్రతిరోజు కుప్పం వెళ్లడం సాధ్యం కాదు కాబట్టి.. ఆయన నియమించుకున్న ప్రతినిధుల ద్వారా ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నారు.. ముఖ్యమంత్రి అయిన తర్వాత కుప్పం విషయంలో చంద్రబాబు నిత్యం పర్యవేక్షణ చేస్తున్నారు. అందువల్లే ఆయన పనితీరు కూడా అద్భుతంగా ఉందని ఈ సర్వేలో తేలింది.

**రాజకీయాల్లోకి కేకే**

దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా చిత్రవిచిత్రమైన నంబర్లతో, సర్వేల పేరుతో సోషల్ మీడియాలో విపరీతమైన హంగామా సృష్టించిన కేకే సర్వేస్ అధినేత కిరణ్ కొండేటి ఇప్పుడు నేరుగా రాజకీయ రంగప్రవేశానికి సిద్ధమవుతున్నారు. ఇప్పటివరకు తెరవెనుక కూర్చుని ఓట్ల శాతం, సీట్ల లెక్కలంటూ గాల్లో మేడలు కట్టిన ఆయన.. ఇప్పుడు నేరుగా రాజకీయ రంగంలోకి దిగుతున్నట్లు ప్రకటించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అర్హులైన ప్రజలను కుల, మత, జాతి విభేదాలు లేకుండా ప్రోత్సహించడానికే ఏకం అనే ప్లాట్‌ఫామ్‌ను తీసుకొస్తున్నామని ప్రకటించారు. పంచాయతీ, మండల పరిషత్ నుంచి మొదలుపెట్టి రానున్న రోజుల్లో అసెంబ్లీ, పార్లమెంట్ వంటి అన్ని రకాల ఎన్నికల్లోనూ ఈ వేదిక తరపున అభ్యర్థులను నిలబెడతామంటూ విజయవాడ స్టార్ హోటల్‌లో సమావేశం ఏర్పాటు చేసి ప్రకటించారు. గతంలో ఏదో ఒక ఎన్నికల ఫలితాన్ని అంచనా వేసి లైమ్‌లైట్‌లోకి వచ్చినప్పటికీ.. ఆ తర్వాత ఆ క్రెడిబిలిటీని సోషల్ మీడియాలో, పొలిటికల్ సర్కిల్స్‌లో క్యాష్ చేసుకునేందుకు ఆయన పడ్డ పాట్లు అందరికీ తెలిసిందే. సర్వే నంబర్ల పేరుతో పక్కా సైంటిఫిక్ స్టడీలని నమ్మబలుకుతూ ఇచ్చిన లెక్కలు పలుమార్లు తలకిందులై తీవ్ర ఎదురుదెబ్బలు తగిలాయి. జూబ్లీహిల్స్ ఎన్నికల ఫలితంతోనే ఆయన మరో ఆరా మస్తాన్ అని అందరికీ క్లారిటీ వచ్చేసింది. సొంత విశ్వసనీయతపై పెద్ద ఎత్తున ప్రశ్నలు తలెత్తడంతో, ఇక సర్వేల పేరుతో విశ్లేషణలు చెబితే ప్రజలు పట్టించుకునే స్థితిలో లేరనే వాస్తవాన్ని గుర్తించే.. ఈసారి డైరెక్ట్‌గా తానే ఒక పార్టీ లేదా రాజకీయ వేదికను తెరపైకి తెస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలంటే గ్రామస్థాయిలో గ్రూపు తగాదాలు, భారీ ఆర్థిక వనరులు, బలమైన కేడర్‌తో ముడిపడి ఉండే వ్యవహారం. అలాంటి చోట కేవలం ఏకం అనే ఒక వేదికను సృష్టించి, ఆసక్తి ఉన్న వారికి టికెట్లు ఇస్తామంటే గ్రామాల్లో ఓట్లు రాలతాయా అన్నది కనీస ప్రశ్న.

## పేదల కోసం మరో 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం

-మొదటిపేజీ తరువాయి
రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు కేంద్రం ఇటీవలే ఈ 3 లక్షల ఇళ్లను కేటాయించింది. దీంతో ఏమాత్రం జాప్యం చేయకుండా నిర్మాణ పనులను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇదే సమయంలో, వచ్చే ఏడాది మార్చి నాటికి మరో 4.20 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

**దేశంలోనే తొలిసారిగా 3డీ ప్రింటింగ్ టెక్నాలజీ**

ఈ కార్యక్రమంతో పాటు, గృహ నిర్మాణ రంగంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలుకుతూ దేశంలోనే తొలిసారిగా 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీతో ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన పైలట్ ప్రాజెక్టుకు కూడా చంద్రబాబు, శివరాజ్ సింగ్ చౌహాన్ శంకుస్థాపన చేయనున్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, సీఎస్ఐఆర్-సీబీఆర్ఐ (రూర్కీ), ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా ఈ ప్రాజెక్టును చేపడుతున్నాయి. పైలట్ ప్రాజెక్టు కింద తెనాలి నియోజకవర్గంలోని బుర్రిపాలెం, ఓబులనాయుడు పాలెం గ్రామాల్లో రూ.14 కోట్ల అంచనా వ్యయంతో 177 ఇళ్లను నిర్మించనున్నారు. ఈ అత్యాధునిక టెక్నాలజీ ద్వారా అత్యంత వేగంగా, తక్కువ శ్రమతో నిర్మాణం పూర్తి చేయడం, నిర్మాణ వ్యర్థాలను తగ్గించడం, నాణ్యత, పటిష్ఠతను పెంచడం సాధ్యమవుతుందని అధికారులు వివరిస్తున్నారు.

**ముఖ్యమంత్రి పర్యటన వివరాలు**

సీఎం చంద్రబాబు ఆదివారం ఉదయం 10:15 గంటలకు ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి బయలుదేరి 10:35 గంటలకు బుర్రిపాలెం చేరుకుంటారు. ఉదయం 10:40 గంటలకు 3డీ ఇళ్ల నిర్మాణ పైలట్ ప్రాజెక్టుకు భూమిపూజ చేసి, అనంతరం లబ్ధిదారులతో సమావేశమవుతారు. 11:10 గంటలకు అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగిస్తారు. పర్యటన ముగించుకుని మధ్యాహ్నం 1:35 గంటలకు తిరిగి క్యాంపు కార్యాలయానికి చేరుకుంటారు.

## అమరావతిలో గ్రామకంఠాల మినహాయింపులపై పునఃపరిశీలన

-మొదటిపేజీ తరువాయి
పరిధిలోని 29 గ్రామాల్లో 2014-19 మధ్య గ్రామకంఠం కింద పరిగణించిన భూములను భూసమీకరణ నుంచి మినహాయించారు. రాజధాని ప్రకటన చేసే నాటికి ఉన్న గ్రామకంఠాలతో పాటు విస్తరించిన ప్రాంతాలను ఉపగ్రహ చిత్రాలు, రెవెన్యూ రికార్డుల ఆధారంగా గుర్తించారు. వాటితో పాటు గ్రామాలను ఆనుకుని ఉన్న పొగాకు బ్యారెన్‌లు, పశువుల కొట్టాలు తదితర నిర్మాణాలను కూడా నిబంధనల మేరకు మినహాయింపుగా పరిగణించారు. ఇందుకుగానూ సీఆర్డీఏ కొన్ని నిబంధనలు రూపొందించింది.

**698 దరఖాస్తులు 17 మందికే అర్హత**

2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తమ స్థలాలను గ్రామకంఠాలుగా పరిగణించి భూసమీకరణ నుంచి మినహాయించాలని 698 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. వీటి పరిశీలనకు ప్రభుత్వం గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేసింది. క్షేత్రస్థాయిలో పరిశీలించిన కమిటీ 17 మందికి మాత్రమే మినహాయింపు ఇచ్చేందుకు అర్హత ఉందని తేల్చింది. దీంతో దరఖాస్తు చేసుకున్న మిగతా రైతుల్లో అసంతృప్తికి కారణమైంది.

**గత మినహాయింపులపై ఆరోపణలు**

2014-19 మధ్య కొందరికి నిబంధనలకు విరుద్ధంగా గ్రామకంఠాల నుంచి మినహాయింపులు ఇచ్చారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. కొందరు సీఆర్డీఏ అధికారులు లబ్ధిదారులతో కుమ్మక్కయ్యారంటూ వారు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మంత్రి నారాయణ సీఎంతో చర్చించగా, గతంలో ఇచ్చిన మినహాయింపులన్నీ పునఃపరిశీలించాలని సీఎం ఆదేశించినట్లు మంత్రి కార్యాలయం తెలిపింది. మరోవైపు గ్రామకంఠాల మినహాయింపులపై ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. 2014 డిసెంబరు 8ను కటాఫ్ తేదీగా పరిగణిస్తున్నట్లు తెలిపింది. ఆ తేదీకి ముందే నిర్మాణాలు ఉన్న భూములు, చదరపు గజాల ప్రాతిపదికన రిజిస్ట్రేషన్లు జరిగిన ప్లాట్లను నిబంధనల ప్రకారం మినహాయింపునకు పరిగణించినట్లు వెల్లడించింది. గ్రామ నివాస ప్రాంతానికి దూరంగా ఉన్న ఖాళీ వ్యవసాయ భూములు, కటాఫ్ తేదీ తర్వాత రిజిస్ట్రేషన్లు జరిగిన భూములకు మినహాయింపు వర్తించదని స్పష్టం చేసింది. ఇప్పటికే 6,473.72 ఎకరాలను ఎల్‌పీఎస్ నుంచి మినహాయించారు. అపరిష్కృత దరఖాస్తుల పరిశీలనకు 2026 జనవరిలో జిల్లా స్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీకి వచ్చిన 685 దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, రికార్డులు, శాటిలైట్ చిత్రాలు, రిజిస్ట్రేషన్ వివరాల ఆధారంగా నిర్ణయాలు తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. అర్హులైన రైతులకు నిబంధనల ప్రకారం అన్ని ప్రయోజనాలు అందిస్తామని సీఆర్డీఏ స్పష్టం చేసింది.

## గ్లోబల్ హార్టికల్చర్ హబ్ సభ భారీ సక్సెస్.

**రాయచోటి :** అన్నమయ్య జిల్లా మదనపల్లెలో జరిగిన హార్టికల్చర్ హబ్ సభ భారీ సక్సెస్ అయిందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గాజుల కాదర భాష పేర్కొన్నారు. శనివారం రాయచోటి లోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో గాజుల ఖాదర్ బాషా మాట్లాడారు. మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో మదనపల్లె హార్టికల్చర్ హబ్ సభకురాయచోటి నుండి తండోపతండాలుగా ప్రజలు రైతులు. తరలి వెళ్లారని వివరించారు. రాయలసీమలో వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థకు హార్టికల్చర్ హబ్ ఎంతో బలం. చెప్పారు. మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో రాయచోటి నుండి పెద్ద ఎత్తున మదనపల్లె నందు జరిగిన హార్టికల్చర్ హబ్ సభకు తరలివచ్చిన ప్రజలు మరియు రైతులు కు హృదయపూర్వక అభినందనలు నమస్కారములు గాజుల ఖాదర్బాషా తెలియజేశారు.. రాయలసీమలో వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థకు హార్టికల్చర్ హబ్ ఎంతో బలమని తద్వారా ఉద్యాన పంటలకు మార్కెట్ గిట్టుబాటు ధరలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు హార్టికల్చర్ హబ్ తో ఒకపక్క రైతుల ఆదాయం కూడా పెరుగుతుందని దీనివల్ల రాయలసీమలోని రైతులందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారని ప్రపంచ చరిత్రలోనే ఏ దేశంలో లేని విధంగా మన రాష్ట్రంలో ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు మరియు ఐటీ విద్యాశాఖ మాత్యులు నారా లోకేష్ బాబు కృషితో లక్ష కోట్ల రూపాయలతో హార్టికల్చర్ హబ్ ఏర్పాటు ఒక చారిత్రాత్మకమైన విషయమని ఇది చరిత్రలో నిలిచిపోతుందని తెలిపారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఏకైక లక్ష్యం రాయలసీమను రతనాల సీమగా చూడాలన్నది ఆయన లక్ష్యం అని తెలిపారు దేశానికే వెన్నముకా రైతులని రైతులు సంతోషంగా ఉండాలని రైతులు బాగుంటే రాష్ట్రం బాగుంటుంది అనే నినాదంతో అన్నదాతకు ప్రయోజనం చేకూర్చేందుకు ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు మరియు ఐటి విద్యాశాఖ మంత్రివర్యులునారా లోకేష్ బాబు యొక్క కృషితో రిలయన్స్ అధినేత అనంత్ అంబానీ కి కష్టపడి ఒప్పించి మదనపల్లెలో హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేయడం అలాగే ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ కు కూడా శంకుస్థాపన చేయడం 2026 అక్టోబర్ టు సీమ చరిత్రలో నిలిచిపోతుందని తెలిపారు చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఎంతో ముందుకు వెళుతుందని రాయలసీమను ఒకపక్క వాటర్ సెక్యూర్డ్ రీజియన్ గా తీర్చిదిద్దే ప్రయత్నం కూడా చేస్తున్నారని తెలిపారు రైతుల కుటుంబంలో చంద్రబాబు నాయుడు పుట్టినారు కాబట్టి ఆయనకు రైతుల కష్టాలు బాగా తెలుసు అని 1997లోనే ఇజ్రాయిల్ నుంచి డ్రిప్ ఇరిగేషన్ తీసుకొచ్చి రైతులకు చంద్రబాబు పరిచయం చేశారని చెప్పారు ఎన్నో పత్రికలలో చంద్రబాబు చూపించిన విధులను చూసి చంద్రబాబును వాటర్ మాన్ గా రాస్తే వైసిపి పార్టీ ఓర్వలేక నానా దుర్భాష పదజాలాలు వాడినారని తెలిపారు ఈరోజు రాష్ట్రంలో ఉన్న ప్రతి రైతు చంద్రబాబు నాయుడు పరిపాలనపై నమ్మకంతో హర్షం వ్యక్తం చేస్తున్నారని చంద్రబాబు నాయుడు ఒక్కరే రైతుల గురించి రాత్రింపగలు ఆలోచిస్తున్నారని గత వైసీపీ ప్రభుత్వంలో రైతులు అప్పుల్లో కురుకుపోయారని వైసీపీ ప్రభుత్వంలో రైతుల ఆత్మహత్యల్లో దేశంలోనే మొదటి స్థానంలో అప్పుడు ఉన్నదని ఇప్పుడు ప్రతి రైతు హాయిగా చంద్రబాబు నాయుడు దీవెనలు అందిస్తున్నారని తెలిపారు తీవ అన్నదాత సుఖీభవ కింద ప్రతిరైతు ఖాతాలో 20000 రూపాయలు జమ చేసిన ఏకైక ముఖ్యమంత్రి ఎవరైనా ఉన్నారంటే చంద్రబాబు నాయుడు ఒక్కరే అని తెలిపారు అలాగే రాయచోటి లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాయచోటి రూరల్ టిడిపి మండల అధ్యక్షులు గండికోట సుధాకర్ మీడియాతో మాట్లాడుతూ రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్ తో వైసీపీ పార్టీలో వణుకు పుట్టిందన్నారు.

# అంతరిక్ష క్విజ్‌లో నారాయణ విద్యార్థుల సత్తా

## ప్రథమ, బండి లిఖిత ద్వితీయ సుదం శెట్టి హంసిని బహుమతులు కైవసం



**కొవ్వూరు మీ వార్త అక్టోబర్ 3** అంతర్జాతీయ అంతరిక్ష వారోత్సవాల సందర్భంగా కొవ్వూరు మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో నిర్వహించిన మండలస్థాయి అంతరిక్ష క్విజ్ పోటీల్లో నారాయణ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి ప్రథమ, ద్వితీయ బహుమతులను కైవసం చేసుకున్నారు. ఈ పోటీల్లో నారాయణ స్కూల్‌కు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని బండి లిఖిత ప్రథమ బహుమతిని, సుదం శెట్టి హంసిని ద్వితీయ బహుమతిని సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రాంబాబు తెలిపారు. మండల స్థాయిలో నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరచి మొదటి రెండు స్థానాలను సాధించడం పట్ల పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. అంతర్జాతీయ అంతరిక్ష వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని అక్టోబర్ 8న రాజమహేంద్రవరంలోని ఆలం కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రాంబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలస్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు.

విద్యార్థులు మండల స్థాయిలో తమ ప్రతిభను చాటుకుని ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలవడం పట్ల నారాయణ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ డీజీఎం రామిరెడ్డి, హైస్కూల్ కోఆర్డినేటర్ బి. కిరణ్ కుమార్, పాఠశాల ఏజీఎం కనకదుర్గ, వైస్ ప్రెసిడెంట్ రోజా శివకుమారి, ఏవో రాజేష్ అభినందనలు తెలిపారు. విద్యార్థులకు మార్గనిర్దేశం చేసిన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బందిని వారు అభినందించారు.

చదువుతో పాటు విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని, సృజనాత్మకతను పెంపొందించేలా వివిధ పోటీలు, కార్యక్రమాల్లో పాల్గొనేలా ప్రోత్సహిస్తున్న పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయుల కృషిని పలువురు తల్లిదండ్రులు అభినందించారు. విద్యార్థుల ప్రతిభకు తగిన ప్రోత్సాహం అందించడం ద్వారా వారు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించేలా పాఠశాల యాజమాన్యం కృషి చేస్తోందని తల్లిదండ్రులు పేర్కొన్నారు.

# ప్రభుత్వ స్థలాలు, ఊటకాలవ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్

**నెల్లూరు జిల్లా చెరుకుముడి అక్టోబర్ 3 (మీ వార్త ప్రతినిధి)** చెరుకుముడీ పెద్ద చెరువుకు చెందిన సర్వే నంబర్ 499 లో ఉన్న ఊటకాలవతో పాటు, రైతుల రాకపోకలకు ఉపయోగపడే దారి/డొంక స్థలాన్ని కూరపాటి రాధాకృష్ణ (తండ్రి: రమణయ్య) అనే వ్యక్తి అక్రమంగా ఆక్రమించి సాగు చేసుకుంటున్నారు. ఊటకాలవను పూడ్చివేయడం వల్ల నీటి పారుదలకు తీవ్ర విఘాతం ఏర్పడుతోందని, డొంక దారిని ఆక్రమించడంతో రైతులు పొలాలకు వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కూడా సదరు వ్యక్తి కుటుంబం ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించి విక్రయించిన ఆధారాలు ఉన్నాయని, అక్రమాలను ప్రశ్నించిన వారిని బెదిరింపులకు గురిచేస్తున్నారని తెలిపారు.



స్థానిక అధికారుల వైఖరిపై అసంతృప్తి:

ఈ ఆక్రమణలపై స్థానిక విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ కు జోగి బుజ్జయ్య గారికి పలుమార్లు విన్నవించినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని రైతులు తెలిపారు. విఆర్ఓ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తూ ఆక్రమణదారునికి సహకరిస్తున్నారని ఆరోపించారు.

రైతులు మరియు స్థానికుల డిమాండ్లు:

రెవెన్యూ సర్వేయర్ ద్వారా సర్వే నంబర్ 499 లోని ఊటకాలవ, దారి/డొంక సరిహద్దులను తక్షణమే కొలతలు వేయించి ఆక్రమణలను తొలగించాలి.

ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించి, ప్రజలను బెదిరిస్తున్న ఆక్రమణదారునిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలి.

ఫిర్యాదులపై స్పందించకుండా ఆక్రమణదారునికి సహకరించిన స్థానిక అధికారులపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

# సేవా సంకల్ప్ అభియాన్‌లో వైద్య శిబిరం

## అయినవిల్లి మండలం కె.జగన్నాథపురంలో నిర్వహణ

**అమలాపురం, మీ వార్త ప్రతినిధి,** అక్టోబర్, 3 అయినవిల్లి మండలం కె.జగన్నాథపురంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమాల్లో భాగంగా శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఎం.ఎల్.హెచ్.పి. టి. షారోన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరానికి స్థానిక ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షులు యనమదల వెంకటరమణ, జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ నల్లా శ్రీను, ఎస్ఎంసీ చైర్మన్ జిలగం శ్రీ సుధ వైద్య శిబిరాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. శిబిరానికి వచ్చిన ప్రజలతో మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని కేవలం వేడుకగా కాకుండా సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు చేరువయ్యేలా నిర్వహించడం సేవా సంకల్ప్ అభియాన్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. సమాజంలోని ప్రతి వర్గానికి ఆరోగ్య సేవలు అందుబాటులో ఉండేలా ఇటువంటి వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజలు తమ ఆరోగ్యం పట్ల



నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ముఖ్యంగా రక్తపోటు, మధుమేహం, రక్తహీనత వంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన వైద్య సలహాలు, చికిత్స తీసుకోవడం ద్వారా అనేక అనారోగ్య సమస్యలను నియంత్రించవచ్చని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాల నిర్వహణ వల్ల ప్రజలకు తమ గ్రామంలోనే ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు, వైద్యుల సూచనలు పొందే అవకాశం కలుగుతుందని తెలిపారు. ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన వారికి మెరుగైన వైద్య సేవలు అందేలా సంబంధిత వైద్య సిబ్బంది సహకరించాలని కోరారు. ప్రధాని మోదీ సేవా స్ఫూర్తితో సేవ, ఆరోగ్యం, ప్రజా సంక్షేమం అనే లక్ష్యాలతో బీజేపీ ఆధ్వర్యంలో మరిన్ని



సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలకు స్థానిక ప్రజలు కూడా సహకరించాలని పిలుపునిచ్చారు.

అనంతరం వెలువలపల్లి లో డాక్టర్ సంతోష్, ఎం.ఎల్.హెచ్.పి శైలజ ఆద్వర్యంలో జరిగిన వైద్య శిబిరం లో యనమదల వెంకటరమణ, గనిశెట్టి వెంకటేశ్వరరావు పాల్గొని పరిశీలించారు. అనంతరం అదే గ్రామంలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి, గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు.

ఈ వైద్య శిబిరాలలో ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సూచనలు అందించారు.

ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ ముద్రగడ చంటి, గొలకోటి కృష్ణారావు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, వైద్య సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఈ నెల 11వ తేదీ నుంచి 20వ తేదీ వరకు శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శరన్నవరాత్రుల ఉత్సవాలు



**నెల్లూరు జిల్లా రూరల్ అక్టోబర్ 3( మీ వార్త ప్రతినిధి)** శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శరన్నవరాత్రుల ఉత్సవాల ఏర్పాట్లపై ఆర్.డి.ఓ., మరియు వివిధ శాఖల అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించిన నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మరియు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి. సాధారణ భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలి. ఎక్స్రా లకు మధ్యాహ్నం 12.30 గంటల నుండి 1.30 గంటల వరకు అలాగే సాయంత్రం 5.00 గంటల నుండి 6.00 గంటల వరకు అమ్మవారిని దర్శించుకోవచ్చు. దాతలు వచ్చినప్పుడు ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలకండి. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. రాజకీయ జెండా, అజెండాలు నాకు ఎన్నికలవేళ మాత్రమే ఉంటాయి. అందుకే రాజకీయాలకు అతీతంగా అందరిని కలుపుకొని నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నాం. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. నేను కూడా సాధారణ భక్తుడిలాగానే దసరా రోజు క్యూ లైన్ లో అమ్మవారిని దర్శించుకుంటా. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. అధికారులకు పూర్తి స్వేచ్ఛను ఇస్తున్నాం, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయండి. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. నాకు అమ్మవారు అంటే ఎంతో భక్తి. నేను కూడా ఎమ్మెల్యే అనే హోదాని బయట వదిలేసి, అమ్మవారి దేవస్థానంలోకి వస్తాను. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. పై కార్యక్రమంలో శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం కమిటీ సభ్యులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# వింజరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మానసిక ఆరోగ్యంపై అవగాహన

డాక్టర్ కె. మురళీధర్, డాక్టర్ కె. వాసు, జె. ప్రసాద్




**పోలవరం మీ వార్త అక్టోబర్ 3** జాతీయ మానసిక ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా వింజరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ కె. మురళీధర్, డాక్టర్ కె. వాసు, జె. ప్రసాద్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. జిల్లా మానసిక వైద్య నిపుణులు డాక్టర్ బి. జోయల్ రాజు మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఆందోళన, దిగులు, మానసిక కృంగుబాటు, మత్తు పదార్థాల వినియోగం తదితర కారణాలతో మానసిక సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. మానసిక వ్యాధులను మందులు, కౌన్సిలింగ్ ద్వారా నియంత్రించి నయం చేసుకోవచ్చని తెలిపారు. పౌష్టికాహారం, సమయపాలన, తగినంత నిద్ర, యోగా, ధ్యానం, రిలాక్సేషన్ పద్ధతులతో మానసిక ప్రశాంతత పొందవచ్చన్నారు. మానసిక వ్యాధుల లక్షణాలను తొలిదశలోనే గుర్తించి తగిన వైద్యం పొందాలని సూచించారు. మానసిక సమస్యలకు మందులు, కౌన్సిలింగ్ సేవలు ప్రతి నెల అందుబాటులో ఉంటాయని తెలిపారు. మానసిక సమస్యల పరిష్కారం కోసం టెలి-మానస్ టోల్‌ఫ్రీ నంబర్ 14416కు కాల్ చేసి ఉచిత కౌన్సిలింగ్ పొందవచ్చని మానసిక సామాజిక కార్యకర్త ఎల్. తిరుపతి స్వామి తెలిపారు. ప్రతి ఒక్కరూ మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆశా కార్యకర్తలు ఏఎన్ఎం లు, ఎం ఎల్ హెచ్ పి లు ఇతర సిబ్బంది పాల్గొనడం జరిగింది.



# ఉపాధి హామీ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలి

## జి- రాంజీ పథకాన్ని రద్దు చేయాలి



**జంగారెడ్డిగూడెం, అక్టోబర్ 3 ( మీ వార్త ప్రతినిధి ):** మండల పరిధిలోని మైసన్నగూడెం గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో గ్రామీణ పేదలు, వ్యవసాయ కార్మికుల సమస్యలపై చర్చించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గ్రామ సచివాలయ కార్యదర్శికి పలు డిమాండ్లతో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జి సూర్య కిరణ్ మాట్లాడుతూ, గ్రామీణ పేదలకు జీవనాధారంగా ఉన్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. గ్రామంలో పని కోరిన ప్రతి కుటుంబానికి 15 రోజులలోగా ఉపాధి కల్పించాలని, పని కల్పించలేని పక్షంలో నిబంధనల ప్రకారం నిరుద్యోగ భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. మైసన్నగూడెంలోని నూకాలమ్మ చెరువుతో పాటు ఇతర చెరువుల అభివృద్ధి పనులు, గ్రామానికి అవసరమైన ప్రజా పనులను ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టాలని అన్నారు. పనులకు వచ్చే కూలీలకు పలుగు, పార వంటి పనిముట్లు, మంచినీరు, ఎండ నుంచి రక్షణకు టెంట్లు, మెడికల్ కిట్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.

జి రాంజీ పథకాన్ని రద్దు చేసి, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని జి. సూర్య కిరణ్ డిమాండ్ చేశారు. గ్రామీణ పేదల ఉపాధి హక్కును కాపాడేందుకు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు.

# పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం




**జంగారెడ్డిగూడెం, అక్టోబర్ 3 ( మీ వార్త ప్రతినిధి ):** స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ పరిధిలో గుర్తించిన చెరువులు, కుంటలు, కాలువలు, డ్రైన్లు మరియు పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నీటి వనరుల పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు మరియు ఇతర వ్యర్థాలను తొలగించారు. నీటిపై తేలియాడుతున్న వ్యర్థాలను కూడా సేకరించి పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. అనంతరం ప్రజలకు చెరువులు, కాలువలు, డ్రైన్లు మరియు నీటి వనరుల్లో చెత్తను వేయకూడదని, వ్యర్థాలను తడి, పొడి వ్యర్థాలుగా వేరు చేసి మున్సిపల్ పారిశుధ్య సిబ్బందికి అందించాలని అవగాహన కల్పించారు. నీటి వనరులను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే వెంకటరమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.దుర్గాప్రసాద్ శానిటేషన్ సెక్రటరీలు, సూపర్‌వైజర్లు మరియు పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

# జనసేన జెండా ఆవిష్కరణ చేసిన ఎంపి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్

**రౌతులపూడి అక్టోబర్ 3 :( మీ వార్త న్యూస్ ప్రతినిధి )** రౌతులపూ మండలంలో ఎస్.అగ్రహారం, గిడజాం మరియు లచ్చిరెడ్డిపాలెం గ్రామాల్లో జనసేన పార్టీ జెండాను కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ శనివారం ఆవిష్కరించారు.
జనసేన పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త మేడిశెట్టి సూర్యకిరణ్ (బాబి) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఆయా గ్రామాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించిన అనంతరం స్థానిక నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు.
లచ్చిరెడ్డిపాలెం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ నాయకత్వంపై నమ్మకంతో ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు జనసేన పార్టీలో చేరుతున్నారని తెలిపారు.
పవన్ కళ్యాణ్ నాయకత్వంలో జనసేన పార్టీ ప్రజలకు మరింత చేరువవుతూ రాష్ట్రంలో బలమైన రాజకీయ శక్తిగా ఎదుగుతోందన్నారు . ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి, సంక్షేమం కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని ఉదయ్ శ్రీనివాస్ సూచించారు.
రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ సత్తా చాటుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.
గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రతి గ్రామంలో ప్రజలతో మమేకమై పనిచేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.
ప్రతి కార్యకర్త పార్టీకి బలమని, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగితే గ్రామస్థాయి నుంచి జనసేన పార్టీ మరింత బలపడుతుందని తెలిపారు.
రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే ప్రజల్లో విస్తృతంగా పనిచేయాలన్నారు.
జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు, డిసిసిబి చైర్మన్ తుమ్మల బాబు, స్థానిక జనసేన పార్టీ నాయకులు కరణం



సుబ్రహ్మణ్యం, గాబు సుభాష్, వరుపుల సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికలకు సమష్టి కార్యాచరణతో ముందుకు సాగాలి రవీంద్రనాథ్ ఠాగూర్

**టీడీపీ నాయకులు, కార్యకర్తలకు-టీడీపీ రాష్ట్రకార్యనిర్వాహక కార్యదర్శి -కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్**

**నర్సాపురం ; అక్టోబర్3మీ వార్త జిల్లా ప్రతినిధి.** పెరవలి మండలం కొత్తపల్లి అగ్రహారం గ్రామంలో రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు నాయకత్వంలో టీడీపీ క్యాడర్‌తో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నిడదవోలు నియోజకవర్గ పరిశీలకులు, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్ ముఖ్య అతిథిగా హాజరై నాయకులు, కార్యకర్తలతో పార్టీ కార్యక్రమాలు, స్థానిక పరిస్థితులు, రానున్న స్థానిక ఎన్నికలకు సంబంధించిన అంశాలపై సమీక్షించారు.
అనంతరం అజరం గ్రామంలో కూడా టీడీపీ క్యాడర్‌తో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్ మాట్లాడుతూ, రానున్న స్థానిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామస్థాయిలో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పార్టీకి సంబంధించిన కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేసే విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని తెలిపారు.
కూటమి ధర్మాన్ని పాటిస్తూ, నాయకుల మధ్య సమన్వయం మరియు పరస్పర సహకారంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.
గ్రామస్థాయిలో పార్టీ శ్రేణుల మధ్య సమన్వయం బలంగా ఉంటేనే ఎన్నికల సమయంలో ఎదురయ్యే పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనే అవకాశం



ఉంటుందని నాయకులకు సూచించారు.
స్థానిక ఎన్నికల్లో పార్టీ తరఫున పోటీ చేసే అభ్యర్థులకు సంబంధించి నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని, వ్యక్తిగత అభిప్రాయాలకు భిన్నంగా పార్టీ నిర్ణయాలను గౌరవిస్తూ ముందుకు సాగాలని ఆయన సూచించారు. గ్రామాల్లో ప్రజలతో నిరంతరం సంబంధాలు కొనసాగిస్తూ, వారి సమస్యలను తెలుసుకుని సంబంధిత నాయకుల దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వం, కార్యకర్తలతో నిరంతర సమన్వయం, ప్రజా సమస్యలపై స్పందన వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్ సూచించారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వాస్తవ సమాచారాన్ని వివరించాలని, ప్రభుత్వ కార్యక్రమాల వల్ల ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను గ్రామస్థాయిలో తెలియజేయాలని అన్నారు. ప్రతి గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి పనిచేస్తూ స్థానికంగా ఉన్న సమస్యలను గుర్తించి, ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలను అందించే దిశగా కృషి చేయాలని సూచించారు. ఎన్నికల సమయంలో మాత్రమే కాకుండా సాధారణ రోజుల్లో కూడా ప్రజలకు అందుబాటులో ఉండటం ద్వారా పార్టీ శ్రేణులు ప్రజలతో నిరంతర సంబంధాలను కొనసాగించాలని తెలిపారు. గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు పార్టీ కార్యక్రమాలపై సమీక్షలు నిర్వహిస్తూ, నాయకులు మరియు కార్యకర్తల అభిప్రాయాలను తెలుసుకుని సమన్వయంతో ముందుకు వెళ్లాలని సమావేశంలో సూచించారు. రానున్న స్థానిక ఎన్నికల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలను గుర్తించి, పార్టీ నిర్ణయాలకు అనుగుణంగా సమష్టిగా పనిచేయాలని నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో పెరవలి మండల అధ్యక్షులు అతికాల శ్రీను, మారిశెట్టి పోతురాజు, బర్రె దొరస్వామి, బండి అభిషేక్, బండారు బాబి, కేతా నాగేశ్వరరావు, ఉలుసు శ్రీను, పి. శ్రీనివాసరావు, ఎం. రాంబాబు, శ్రీనివాస గనిరాజు, నరసాపురం అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ నాగ్ర నరేష్ కుమార్, పెచ్చెట్టి శ్రీనివాస్, లాలం శివరమేష్, గంటే శ్రీను తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రామాలాభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

**పల్లె ప్రగతి పండగ 3.0 తో గ్రామాలు మరింత అభివృద్ధి**

**వీరవాసరం మండలంలోని పలు గ్రామంలో సీసీ రోడ్లకు శంకుస్థాపనలు, నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే అంజిబాబు**

**వీరవాసరం ; అక్టోబర్ 3మీ వార్త జిల్లా ప్రతినిధి.** ఆంధ్రప్రదేశ్ లో గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, మౌలిక వసతులు ప్రజలకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడంలో పల్లె పండుగ కార్యక్రమం కీలకంగా ఉంటుందని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. వీరవాసరం మండలంలోని పలు గ్రామంలో శనివారం పల్లె పండగ 3.0 లో భాగంగా ఎమ్మెల్యే అంజిబాబు పలు శంకుస్థాపనలు, పలు ప్రారంభోత్సవాలు చేశారు. పల్లె పండుగ 3.0లో భాగంగా నేలపోగుల గ్రామంలో జేఎస్ బి రోడ్డుకు శంకుస్థాపన, మడుగు పోలవరం గ్రామంలో సీసీ రోడ్డు, ఏపీఆర్ఆర్ ఎస్పీ గ్రాంట్ తో బీటీ రోడ్డుకు శంకుస్థాపన, కొణితివాడ గ్రామంలో సీసీ రోడ్లు శంకుస్థాపన, పల్లె పండుగ 2.0లో మంజూరైన నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు, జీఎస్ బి రోడ్డు ప్రారంభోత్సవం, ఉత్తర పాలెంలో సిసి రోడ్డుకు శంకుస్థాపన, పల్లె పండుగ 2.0లో మంజూరైన నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభోత్సవం, నౌడూరు గ్రామంలో పల్లె పండుగ 2.0 లో మంజూరైన నిధులతో నిర్మించిన జీఎస్ బి రోడ్డు ప్రారంభోత్సవం, అండలూరు గ్రామంలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన, తోలేరు గ్రామంలో పల్లె పండుగ 2.0 లో మంజూరైన నిధులతో నిర్మించిన జీఎస్ బి రోడ్డును ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభించారు.
ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో పల్లె పండుగ 1.0, 2.0, 3.0 కార్యక్రమాలను చేపట్టడం జరుగుతున్నాయని, పల్లె పండుగ 1.0 ను 2024 అక్టోబర్ 14న రూ 4,500 కోట్లతో ప్రారంభించగా, పల్లె పండుగ 2.0ను 2025 నవంబర్ 26న రూ 6,787 కోట్లతో ప్రారంభించగా, ప్రస్తుతం పల్లె పండుగ 3.0 లో భాగంగా రూ 11,085 కోట్లతో గ్రామాల్లో వివిధ మౌలిక వసతుల అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు తెలిపారు. సీసీ రోడ్లు, బీటీ





రోడ్లు, డ్రైన్లు, బస్ షెల్టర్లు, గ్రామ పంచాయతీ భవనాలు తదితర మౌలిక వసతులను అభివృద్ధి చేయనున్నట్లు ఎమ్మెల్యే అంజిబాబు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామస్తులు, కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు వీర మహిళలు తెలుగు మహిళలు పాల్గొన్నారు..

# 11 గ్రామాల్లో ఒకేరోజు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన విప్ బొమ్మిడి నాయకర్....

**గ్రామీణాభివృద్ధిలో సరికొత్త శకం.. నరసాపురం మండలంలో రూ. 4.60 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం!**

**నాడు వైకాపా పాలనలో గుంతల మయం.. నేడు కూటమి ప్రభుత్వంలో సీసీ రోడ్ల పండుగ!**

**నరసాపురం ; అక్టోబర్ 3 మీ వార్త జిల్లా ప్రతినిధి.** గ్రామాల సమగ్రాభివృద్ధే ప్రధాన ధ్యేయంగా అడుగులు వేస్తున్న రాష్ట్ర కూటమి ప్రభుత్వం, పల్లెల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తోంది. ఇందులో భాగంగా ఈరోజు నరసాపురం మండలంలోని 11 గ్రామ పంచాయతీల పరిధిలో భారీ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ప్రభుత్వ విప్ మరియు నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్. మండల పరిధిలో మొత్తం, రూ. 4.10 కోట్ల భారీ (ఎడీ-+ =ూవీ +) నిధులతో నూతన సీసీ (జజ) రోడ్ల నిర్మాణాలకు, అలాగే పాడి రైతుల సంక్షేమం కోసం రూ. 50 లక్షల, నిధులతో మినీ గోకులం (పశువుల) షెడ్ల నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వ విప్ మరియు నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ , టీడీపీ ఇంచార్జి పొత్తూరి రామరాజు మాజీ శాసనసభ్యులు బండారు మాధవ నాయుడు, సంయుక్తంగా పాత నవరసపురం, సరిపల్లి, మల్లవరం, రాజుగారి తోట, వై.ఎస్. పాలెం, ఎల్.బి. చెర్ల, వేములదీవి ఈస్ట్,





బియ్యపుతిప్ప, దర్భరేవు, సారవ మరియు లక్ష్మణేశ్వరంలో శంకుస్థాపన చేశారు.
ఈ శంకుస్థాపన కార్యక్రమాల అనంతరం బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ.... "గత ఐదేళ్ల వైకాపా పాలనలో పల్లెల్లో ఒక్క గుంత పూడ్చిన పాపాన పోలేదు. కొత్త రోడ్లు వేసే ఆలోచనే ఆ ప్రభుత్వానికి రాలేదు. గ్రామీణ రోడ్లన్నీ గుంతల మయమై, వర్షాకాలం వస్తే ప్రజలు నరకయాతన అనుభవించారు. అభివృద్ధి అనే పదానికి అర్థం తెలియని అంధకార పాలనను గత ఐదేళ్లు చూశాం. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అతి కొద్ది కాలంలోనే పల్లెలకు మళ్లీ ప్రాణం పోస్తున్నాం. నాడు వాళ్లు వేయలేని రోడ్లన్నీ నేడు కూటమి ప్రభుత్వంలో పండుగ వాతావరణంలో వేస్తున్నాం. నిధుల కొరత లేకుండా గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పనకు కట్టుబడి ఉన్నాం" అని ఆయన స్పష్టం చేశారు. ఈ శంకుస్థాపన కార్యక్రమాలలో కూటమి పార్టీల స్థానిక ప్రజాప్రతినిధులు, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# పారిజాత గిరిలో పవిత్రోత్సావములు ప్రారంభం



**జంగారెడ్డిగూడెం, అక్టోబర్ 3 ( మీ వార్త ప్రతినిధి ):** గోకుల తిరుమల పారిజాత గిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం జంగారెడ్డిగూడెం శ్రీ స్వామివారికి ప్రీతికరమైన రోజు శనివారం కావడంతో వేకువ జామున 4 గంటల 30 నిమిషాలకు సుప్రభాత సేవ తోమాల సేవ ఆరాధన తీర్థ ప్రసాద గోష్టి బాల భోగి నివేదన అనంతరం భక్తులకు శ్రీ స్వామివారు విశేషమైన అలంకరణలో ఆలయ అర్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులు పూజా కార్యక్రమం చేసినారు ఉదయం 6 గంటల నుండి ఆలయ గార్డెన్ మార్గంలో భూ వరహస్వామి దర్శనం అనంతరం కంకణదారులే గిరిప్రదక్షిణ ఏడుకొండలు కాలినడకనవేలాది మంది భక్తులు శ్రీ స్వామివారి గోవింద నామ స్మరణతో భక్తులు పోటెత్తినారు వీరికి ఆలయ ధర్మకర్త మండలి చైర్మన్ అల్లూరి రామకృష్ణ సభ్యులు కార్య నిర్వహణధికారి మణికల రాంబాబు ఎటువంటి అసౌకర్యం కలగకుండా భక్తులకి ఉచిత ప్రత్యేక దర్శనం ఉచిత ప్రసాదం, ఆలయం తరుపున అన్న ప్రసాద వితరణ ఉచిత అన్న ప్రసాదం జరిపించినారు . అక్టోబర్ 05 సోమవారం నుండి 08 వ తేది గురువారం వరకు జరుగుతుందని ఆలయ అర్చకులు నల్లూరి రవికుమార్ ఆచార్యులు తెలిపారు.
ఆలయం ఆదాయం పూజ టికెట్ల ద్వారా ప్రసాదాల ద్వారా విరాళాల ద్వారా అన్నదానం విరాళాల ద్వారా 1,39, 900=00ఆదాయం సమకూరింది అని ఈఓ మణికల రాంబాబు తెలిపారు ఈ పూజా కార్యక్రమంలో ఆలయధర్మకర్తల చైర్మన్ అల్లూరి రామకృష్ణ, కొప్పుల నాగ సురేంద్ర,కన్నా కృష్ణ అన్నప్రగడ వీర రాఘవరావు ఒడిగళ్ళకుమారి ముప్పిడి భాను, మరియు అభివృద్ధి కమిటీ సభ్యులు చైర్మన్ అబ్బీనదత్తాత్రేయ, పెరిచర్ల జగపతిరాజు, రెడ్డి రంగా ప్రసాద్,వాసవిసాయి నగేష్,మొదలగు వారు పాల్గొన్నారు అని ఈఓ మణికల రాంబాబు తెలిపారు.

# ఎస్పీ రాహుల్ మీనా ను కలిసిన బీజేపీ నేత అరవింద్



**అమలాపురం, మీ వార్త ప్రతినిధి, అక్టోబర్, 3** డా.బీ.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ను శనివారం బీజేపీ రాష్ట్ర యువ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గనిశెట్టి అరవింద్ అమలాపురం లోని ఎస్పీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ ను అరవింద్ శాలువా తో సత్కరించారు. జిల్లా అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో పోలీసు శాఖకు సహకరిస్తామని అరవింద్ పేర్కొన్నారు.

# 50 మంది వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

**మాజీ సర్పంచ్ గుణ్ణం రాంబాబు ఆధ్వర్యంలో**



**ఆలమూరు, అక్టోబర్ 3(మీ వార్త ప్రతినిధి )** మండలంలో శీతాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో వృద్ధులకు, నిరుపేదలకు అండగా నిలవడమే ధ్యేయంగా మాజీ సర్పంచ్ గుణ్ణం రాంబాబు శనివారం 50 మంది వృద్ధులకు ఉచితంగా దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గుణ్ణం రాంబాబు మాట్లాడుతూ... రానున్న చలికాలాన్ని దృష్టిలో ఉంచుకుని వృద్ధులు, వయోవృద్ధులు చలి తీవ్రతకు గురికాకుండా ఉండాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. సమాజంలో ఇబ్బందులు పడుతున్న పేదలకు తమవంతు సాయం అందించడం ఎంతో సంతృప్తిని ఇస్తుందన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సామాజిక, సేవా కార్యక్రమాలను మరిన్ని నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. దుప్పట్లు అందుకున్న వృద్ధులు తమకు ఈ కష్టసమయంలో తోడ్పాటు అందించిన మాజీ సర్పంచ్ గుణ్ణం రాంబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసి, అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి యార్లగడ్డ రమేష్ చౌదరి, బీర అబ్బు, గంటా అర్జున్ రావు, నెల్లి సత్యనారాయణ, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

# పినపళ్లలో భారీ అన్నసమారాధన



**ఆలమూరు, అక్టోబర్ 3(మీ వార్త ప్రతినిధి )** శ్రీ గణపతి నవరాత్రి ముగింపు ఉత్సవాలను పురస్కరించుకుని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలంలోని పినపళ్లలో వేంచేసియున్న శ్రీవిఘ్నేశ్వరుడి ఆలయం వద్ద శనివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక ఆలయ ప్రాంగణంలో గ్రామస్తుల సహకారంతో పిండివంటలతో ఈ అన్నసమారాధనను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. పినపళ్ళ తో పాటుగా పరిసర ప్రాంతాల నుంచి సుమారు ఐదు వేల మంది భక్తులు విచ్చేసి ఈ అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. మాజీ సర్పంచ్ సంగిత సుభాష్, ఏఎంసీ మాజీ చైర్మన్ వక్కపట్ల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల భూ సమస్యల ను తక్షణమే పరిష్కరించాలి . పోలవరం నియోజకవర్గం, కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్, బండి విజయ్ భాస్కర్ ..



**టి.నర్సాపురం, (మీ వార్త ప్రతినిధి)** రెండేళ్లుగా భూ సమస్యలతో రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారని పోలవరం కాంగ్రెస్ కో-ఆర్డినేటర్ బండి విజయ్ భాస్కర్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం అప్పలరాజుగూడెం సచివాలయాన్ని కాంగ్రెస్ శ్రేణులతో కలిసి సందర్శించి రైతుల సమస్యలపై అధికారులను నిలదీశారు. వీర్రాజు, ఎల్లే నాగేశ్వరరావు భూములకు సంబంధించిన రికార్డుల్లో తేడాలు ఉన్నప్పటికీ సమస్య పరిష్కారం కాలేదన్నారు. రెండు సంవత్సరాలుగా రైతులు కార్యాలయాల చుట్టూ తిరిగిన ఉపయోగం లేదని ఆయన మండిపడ్డారు,ఈ విషయంపై తాహసీల్దార్ నాగరాజుతో మాట్లాడగా, రికార్డులను పరిశీలించి మంగళవారం నాటికి భూ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సర్వేయర్ బంగారు రాజు మాట్లాడుతూ ఆన్లైన్ రికార్డుల్లో భూమి విస్తీర్ణం తక్కువగా నమోదైందని, రికార్డులను సరిచేసి రైతులకు న్యాయం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సడియం వెంకటేశ్వరరావు, టి. రాణి, ఏసుపాదం, సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు..

## ప్రత్తిపాడు, రాచపల్లి ఆసుపత్రులకు స్వర్ణాంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర పురస్కారాలు

పారిశుధ్య నిర్వహణలో ఉత్తమ పనితీరు, పరిశుభ్రత, ప్రజాసేవకు గుర్తింపు.

ప్రత్తిపాడు నియోజకవర్గం.



**ప్రత్తిపాడు, అక్టోబర్03,(మీ వార్త విలేఖరి)** మండలంలోని రెండు ప్రభుత్వ ఆసుపత్రులకు స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు లభించాయి. పారిశుధ్య నిర్వహణతో పాటు ప్రజలకు విశేష వైద్య సేవలు అందిస్తున్న ప్రత్తిపాడు వైద్య విధాన పరిషత్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ), రాచపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) ఈ అవార్డులకు ఎంపికయ్యాయి. కాకినాడలో శు క్రవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అవార్డులను అందజేశారు. రాచపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిణి గీతా సుధ, ప్రత్తిపాడు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ విద్యా ప్రవంతి అవార్డులను స్వీకరించారు. ఆసుపత్రుల పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణ, వైద్య వ్యర్థాల సమర్థ నిర్వహణతో పాటు రోగులకు అందిస్తున్న సేవల్లో చూపిన పనితీరును పరిగణనలోకి తీసుకుని ఈ అవార్డులు లభించినట్లు వైద్యాధికారులు తెలిపారు.

## ఏలేశ్వరంలో వైభవంగా శ్రీ వరసిద్ధి వినాయక స్వామి శోభాయాత్ర.

ప్రత్తిపాడు నియోజకవర్గం.



**ఏలేశ్వరం,అక్టోబర్ 03.(మీ వార్త విలేకరి)** స్థానిక పల్లపు వీధి రామాలయం వద్ద 9వ వార్డు మాజీ కౌన్సిలర్ శిడగం కన్నారావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 18వ వార్షిక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి నిమజ్జన ఊరేగింపు మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ఈ శోభాయాత్ర కార్యక్రమానికి రాష్ట్ర వైసీపీ యువజన విభాగం కార్యదర్శి బదిరెడ్డి గోవింద్ ముఖ్య అతిథిగా హాజరైయారు, గోవిందు చేతుల మీదుగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి,కొబ్బరికాయ కొట్టి ఊరేగింపును ప్రారంభించారు.ఈ సందర్భంగా బదిరెడ్డి గోవింద్ మాట్లాడుతూ ఆది దేవుడు విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో గ్రామ ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.వరుసగా 18 సంవత్సరాలుగా ఈ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహిస్తున్న కమిటీ సభ్యులను, నిర్వాహకులను ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో 9వ వార్డు మాజీ కౌన్సిలర్ శిడగం కన్నారావు, పల్లపు వీధి యూత్ సభ్యులు, స్థానిక ప్రముఖులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి శోభాయాత్రలో పాల్గొన్నారు.భక్తుల జయజయధ్వానాలు, మేళతాళాల నడుమ ఊరేగింపు అత్యంత ఉత్సాహంగా సాగింది.పట్టణంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

## ఏలేశ్వరం లోసీపీఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి కొసిరెడ్డి గణేష్ సంస్మరణ సభ.

పత్తిపాడు నియోజకవర్గం.



**ఏలేశ్వరం, అక్టోబర్ 03,(మీ వార్త విలేకరి)** ప్రజా సమస్యలపై నిత్యం పోరాడిన ప్రజా నాయకుడు, సీపీఐ ఎంఎల్ వినోద్ మిశ్రా పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొసిరెడ్డి గణేష్ సంస్మరణ సభను ఆదివారం ఏలేశ్వరం పట్టణంలోని వినోద్ మిశ్రా కాలనీలో ఘనంగా ఏర్పాటు చేశామని ఆ పార్టీ నాయకులు వివరించారు ఈ మేరకు శనివారం కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలిపారు.ఈ సందర్భంగా ఎం చలపతి మాట్లాడుతూ.. కొసిరెడ్డి గణేష్ సాధారణ కార్యకర్తగా మొదలై రాష్ట్ర కార్యదర్శి స్థాయికి ఎదిగారన్నారు. పేదలు, కార్మికులు, రైతుల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేశారన్నారు. ముఖ్యంగా ఏలేశ్వరం ప్రాంతంలో భూ సమస్యలు, ఇళ్ల పట్టాల సమస్యలు, కార్మికుల కనీస వేతనాల కోసం ఆయన చేసిన ఉద్యమాలు చిరస్మరణీయమన్నారు.వినోద్ మిశ్రా కాలనీ ఏర్పాటులో ఆయన పాత్ర కీలకమని, పేదలకు సొంత ఇళ్లు కల్పించాలనే ఆశయంతో ఈ కాలనీకి ఆ మహానేత పేరు పెట్టి అభివృద్ధి చేశారని గుర్తు చేసుకున్నారు.గణేష్ మృతి పార్టీకి, ప్రజా ఉద్యమాలకు తీరని లోటు అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన చూపిన బాటలో నడుస్తామని, ఆయన ఆశించిన సమసమాజ స్థాపన కోసం, ప్రజా సేవకు తమ జీవితాలను అంకితం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.ఈ సభను పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఈ విలేకరుల సమావేశం ద్వారా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి హైకోర్టు అడ్వకేట్ ఐ సూర్యనారాయణ, వినోద్ మిశ్రా సహాయ కార్యదర్శి కందుల ప్రసాద్, వినోద్ మిశ్రా పార్టీ కార్యదర్శి గండేటి నాగమణి, గుమ్మడి పాదాలమ్మ, జి సాయి, తదితరులు మిశ్రాశ్రేణులు పాల్గొన్నారు.

## నందమూరులో భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలపై అవగాహన




**తాడేపల్లిగూడెం, అక్టోబర్ 03 (మీ వార్త ప్రతినిధి)** తాడేపల్లిగూడెం మండలం నందమూరు గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం సెంటర్ వద్ద కార్మికుల అడ్డాలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు సభ్యత్వ నమోదు, సంక్షేమ పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం), పశ్చిమగోదావరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి నందమూరు భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు తాతకుంట్ల శ్రీనివాస్ అధ్యక్షత వహించారు.జిల్లా ప్రధాన కార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ మాట్లాడుతూ, ప్రస్తుతం సంక్షేమ బోర్డు సభ్యత్వ నమోదు పూర్తిగా ఆన్లైన్ విధానంలో జరుగుతోందని, ప్రతి కార్మికుడు తప్పనిసరిగా నమోదు చేసుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సభ్యత్వ నమోదు, పునరుద్ధరణ, అర్హతలు, అవసరమైన పత్రాల గురించి ప్రత్యక్షంగా ప్రదర్శించి అవగాహన కల్పించారు.సంక్షేమ బోర్డు ద్వారా అందించే పెళ్లి కానుక, పురుడు కానుక, సహజ మరణ సహాయం, అంత్యక్రియల ఆర్థిక సహాయం, కార్మికుల పిల్లలకు ఆన్లైన్ విద్యా అవకాశాలు, ఉద్యోగ అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణ వంటి పథకాల గురించి వివరించారు.జిల్లా సహాయ కార్యదర్శి కోడె సాయి బాలాజీ మాట్లాడుతూ, ప్రతి కార్మికుడు యూనియన్ సభ్యత్వం తీసుకుని నెలవారీ సమావేశాలకు హాజరై పథకాలపై అవగాహన పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఇరుల్ల పోతురాజు, చిన్నం శ్రీను, మందపల్లి భీమరాజు, ఈరుల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## షష్టిపూర్తి వేడుకలో ఆత్మీయత...శ్రామికుల సంతోషమే నా సంతోషం.





**పాలకొల్లు ; అక్టోబర్ 3మీ వార్త జిల్లా ప్రతినిధి.**పాలకొల్లు నియోజకవర్గం లోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ శ్రామికుల ఆత్మీయ భోజన కార్యక్రమంలో భాగంగా ఈరోజు పాలకొల్లు మండలం లంకలకోడేరులో నిర్వహించారు. ఉపాధి హామీ శ్రామికుల మధ్య శ్రామికులైన గోడి రామారావు, సత్యవతి దంపతుల షష్టిపూర్తి వేడుకను దగ్గరుండి నిర్వహించడం ఎంతో ఆనందంగా అనిపించింది.వారి షష్టిపూర్తి వేడుకను సాంప్రదాయబద్ధంగా నిర్వహించి, నూతన వస్త్రాలు అందించి ఆశీర్వాదం తీసుకున్నాను. ఆ దంపతులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో కలకాలం ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.ఎండా వానలను లెక్కచేయకుండా పల్లె అభివృద్ధికి చెమటోడ్చే ఉపాధి హామీ శ్రామికుల కష్టాన్ని గుర్తించడంతో పాటు.. వారి కుటుంబాల్లోని సంతోషాల్లోనూ భాగస్వామి కావాలన్నదే ఈ ఆత్మీయ కార్యక్రమాల ఉద్దేశం. ప్రజల కష్టాల్లో తోడుగా.. వారి సంతోషాల్లో భాగస్వామిగా ఉండటమే నిజమైన ప్రజాసేవగా భావిస్తాను.

## గ్రామాలు పరిశుభ్రంగా మారాలంటే ప్రజలదే కీలక బాధ్యత

ఎంపీడీవో చంద్రశేఖరం



**తాడేపల్లిగూడెం, అక్టోబర్ 03 (మీ వార్త ప్రతినిధి)** గ్రామాలు పరిశుభ్రంగా, స్వచ్ఛంగా తయారవ్వాలంటే ప్రజలదే కీలక బాధ్యత అని తాడేపల్లిగూడెం ఎంపీడీవో వి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం మండలం మారంపల్లిలో శనివారం నిర్వహించిన పంచాయతీ కార్యదర్శులు, పారిశుధ్య హరిత రాయబారుల ఎక్స్‌పోజర్ విజిట్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో ఇంటింటికి చెత్త సేకరించే విధానం, హరిత రాయబారుల విధులపై క్షేత్రస్థాయిలో వివరించారు.ప్రజలు తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వడం వల్ల కలిగే ఉపయోగాలు, చెత్త నుండి సంపద తయారీ విధానాన్ని సూచించారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రం వద్ద నాడెప్ తొట్టెల నిర్వహణ, వర్మీ కంపోస్ట్ తయారీ అంశాలపై పంచాయతీ కార్యదర్శులు, హరిత రాయబారులకు అవగాహన కల్పించారు.అనంతరం గాంధీ జయంతి సందర్భంగా భీమవరంలో ఉత్తమ హరిత రాయబారిగా అవార్డు అందుకున్న మారంపల్లి హరిత రాయబారి రవిని సత్కరించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఎం.వెంకటేష్, నాయకులు తోట సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు రఘు, డి. నాగదేవి, సరస్వతి, ఆర్.వి.బ్రహ్మం,తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి నాయకుల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న వలవల బాబ్జి



**తాడేపల్లిగూడెం, అక్టోబర్ 03 (మీ వార్త ప్రతినిధి)** పెంటపాడు మండలం బి.కొండేపాడు, చింతపల్లి, జట్లపాలెం గ్రామాల నాయకులు, కార్యకర్తలతో శుక్రవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి తాడేపల్లిగూడెం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంఛార్జ్, భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఛైర్మన్ వలవల మల్లికార్జునరావు (బాబ్జి) ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వలవల బాబ్జి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలంతా సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అబ్జర్వర్ యాదనపూడి బ్రహ్మారాజు, పెంటపాడు మండల అధ్యక్షుడు కిలపర్తి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## భావిశెట్టి వారి గృహప్రవేశ వేడుకలో పాల్గొన్న డాక్టర్ చల్లా.



**అమలాపురం, మీ వార్త ప్రతినిధి, అక్టోబర్, 3** ఆలమూరు మండలం మూలస్థాన అగ్రహారంలో శుక్రవారం జరిగిన భావిశెట్టి రాముడు నూతన గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐక్య కాపునాడు ట్రెజరర్,డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కాపు సంఘం అధ్యక్షులు,ప్రముఖ వ్యాపారవేత్త, జాతీయ సేవా పురస్కార్ అవార్డు గ్రహీత డాక్టర్ చల్లా ప్రభాకర్ రావు. ఈ కార్యక్రమంలో ఎలుగుబంట్ల సాయిబాబు, ఎలుగుబంట్ల బూరయ్య,రేలంగి వీరాస్వామి, రేలంగి సూరిపండు, రేలంగి సత్యనారాయణ,పామర్తి శ్రీను, తోట శ్రీను, ఎలుగుబంట్ల దుర్గ ప్రసాద్, వెత్సా శ్రీను,నార్గని సెంథిల్ కుమార్,నార్గని వీరబాబు,పాక దుర్గ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## రాయగడ భక్తులు భక్తిశ్రద్ధలతో సంతాన వేణుగోపాలస్వామి దర్శనం



**మచిలీపట్నం అక్టోబర్ 3(మీ వార్త ప్రతినిధి)** ఈ రోజు ఒడిశాలోని రాయగడ జిల్లా నుంచి వచ్చిన భక్తులు సంతాన వేణుగోపాలస్వామి ఆలయాన్ని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. స్వామివారి దివ్య మంగళరూపాన్ని కనులారా వీక్షించి, ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి కృపాకటాక్షాలను పొందారు.స్వామివారి సన్నిధిలో భక్తిభావంతో ప్రార్థనలు చేస్తూ, తమ కుటుంబాలకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, సంతాన సౌభాగ్యం ప్రసాదించాలని వేడుకున్నారు. ఆలయ పవిత్ర వాతావరణంలో భక్తులు ఆధ్యాత్మిక ఆనందాన్ని అనుభవించారు.సంతాన వేణుగోపాలస్వామి వారి దివ్య కృపాకటాక్షాలు సర్వ భక్తులపై సదా ఉండుగాక!

## సేవా సంకల్ప అభియాన్ అనే కార్యక్రమం ద్వారా అంగన్వాడి కేంద్రాలలో పనిచేసే టీచర్లు డ ఆయాలను సత్కరించిన కూటమి నాయకులు



**కృత్తివెన్ను అక్టోబర్ 3(మీ వార్త ప్రతినిధి)** ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ 13 సంవత్సరాలు గుజరాత్ ముఖ్యమంత్రిగా 12 సంవత్సరాలు దేశ ప్రధానిగా మొత్తం 25 సంవత్సరాలు ఎనలేని సేవలు చేస్తూ దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తున్నందుకు ఆయన సేవలకు గుర్తుగా సేవా సంకల్ప అభియాన్ అనే కార్యక్రమం ద్వారా అంగన్వాడి కేంద్రాలలో పనిచేసే టీచర్లు మరియు ఆయాలను సత్కరించాలని కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది.ఎన్ డి ఎ ప్రభుత్వం లో మన ప్రధాని మంత్రి నరేంద్ర మోడి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ కాంబినేషన్లో కూటమి ప్రభుత్వం దూసుకు పోతుందని అలానే పెడన నియోజకవర్గం లో శాసన సభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలశౌరి నియోజక ర్గం అభివృద్ధి పదం లో నడుపుతున్నారని అన్నారు. ఇందులో భాగంగా కృత్తివెన్ను మండలం ఎండపల్లి మరియు గాంధీనగరం గ్రామాలలో పనిచేస్తున్న అంగన్వాడి టీచర్లు, ఆయాలను అంగన్వాడీ లబ్ధిదారులు, గ్రామస్తులు గ్రామ పెద్దలు,నాయకులు,అధికారులు మరియు సచివాలయ సిబ్బంది అందరూ కలిసి ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియాడటం జరిగినది.

## అంగన్వాడి ఉత్సవాలు

అంగన్వాడి కేంద్రాలో టీచర్స్ మరియు ఆయాలను సన్మానించిన కూటమి నాయకులు



**పెడన అక్టోబర్ 3(మీ వార్త ప్రతినిధి)** అంగన్వాడి ఉత్సవాల్లో భాగంగా కృత్తివెన్ను మండలం యండపల్లి,గాంధీనగర్ అంగన్వాడి కేంద్రాలో టీచర్స్ మరియు ఆయాలను సన్మానించిన కూటమి నాయకులు గ్రామస్తులు ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్ వైజర్ పంచాయితి సిబ్బంది హెల్త్ కేర్ సిబ్బంది మరియు కూటమి నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వ మోసాలను ఎండగట్టండి

**మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి**

**గన్నవరంలో వైఎస్సార్‌సీపీ ఎటపాక మండల విస్తృత స్థాయి సమావేశం విజయవంతం**

**రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఫ్యాన్ గాలి వీచాలి: శ్రేణులకు పిలుపు**

**మాజీ ప్రజాప్రతినిధులకు ఘన సత్కారం**



**ఎటపాక, అక్టోబర్ 3 మీ వార్త ప్రతినిధి:** ఎన్నికల వేళ ప్రజలకు ఆచరణ సాధ్యంకాని 'సూపర్ సిక్స్' హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, గద్దెనెక్కాక వాటిని తుంగలో తొక్కి ప్రజలను దగా చేసిందని రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం మండల పరిధిలోని గన్నవరం గ్రామంలో ప్రముఖ నాయకుడు ఆకుల దయాకర్ నివాస ప్రాంగణంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల విస్తృత స్థాయి మరియు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి మండల పార్టీ అధ్యక్షుడు ఆకుల వెంకటరామారావు (పెద్దోడు) అధ్యక్షత వహించారు. తొలుత దివంగత ముఖ్యమంత్రి, పేదల పెన్నిధి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి విగ్రహానికి, చిత్రపటానికి పార్టీ ముఖ్య నేతలు, శ్రేణులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి మాట్లాడుతూ... రాష్ట్రంలో కూటమి పాలన పట్ల అన్ని వర్గాల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందన్నారు. యువతకు నెలకు ఇస్తామన్న నిరుద్యోగ భృతి, మహిళలకు నెలకు రూ.3,000 ఆర్థిక సాయం వంటి పథకాలను అటకెక్కించి మోసం చేశారని విమర్శించారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని మండిపడ్డారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలే కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు గుణపాఠం చెప్పే సరైన సమయమని, ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సమన్వయంతో సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రజాసేవలో విశేష సేవలందించిన మండల పరిధిలోని మాజీ ఎంపీటీసీలు, మాజీ జడ్పీటీసీలు, మాజీ సర్పంచులను పార్టీ నేతలు శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కురినాల వెంకటేశ్వర్లు, మండల సోషల్ మీడియా కన్వీనర్ గొంగడి వెంకటరామిరెడ్డి (మాజీ ఎంపీటీసీ), మాజీ ఎంపీపీ కాకా కామేశ్వరి, మాజీ జడ్పీటీసీ ఉబ్బు సుస్మిత, యువజన విభాగం మండల అధ్యక్షుడు తోట శశికుమార్, మహిళా విభాగం అధ్యక్షురాలు గుడిమళ్ల నాగలక్ష్మి, మాజీ ఎంపీటీసీ అంజలి, మండల కార్యదర్శి ముక్కు కల్పన, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు చిచ్చుడి రామారావు, రైతు విభాగం అధ్యక్షుడు ధారా రమేష్, గన్నవరం గ్రామ కమిటీ అధ్యక్షుడు వీర ప్రకాష్, ఎస్ఎంసి చైర్మన్ మోట వంశీ, ఇంటలెక్చువల్ విభాగం అధ్యక్షుడు కురినాల విజయ్, విద్యార్థి విభాగం మండల అధ్యక్షుడు మై సాక్షి రాకేష్, సీనియర్ నాయకులు కుచ్చాలపాటి వెంకటేశ్వర్లు, అన్నెం జయచంద్రారెడ్డి, సారెడ్డి శ్రీనివాసరెడ్డి, చింతూరు మండల పార్టీ అధ్యక్షుడు రామలింగారెడ్డి, చింతూరు మాజీ జడ్పీటీసీ చిచ్చుడి మురళి, రంపచోడవరం మండల పార్టీ అధ్యక్షుడు జల్లేపల్లి రామన్నదొరతో పాటు మండలంలోని పలు గ్రామాల నాయకులు, మహిళలు, యువజన కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# వర్కింగు జర్నలిస్టుల సమస్యలపై ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలి !

**ఐ.జే.యు. డిమాండ్!**




**తాడేపల్లిగూడెం, అక్టోబర్ 3: (మీ వార్త ప్రతినిధి)** గాంధీ జయంతి రోజున దేశవ్యాప్తంగా రోడ్లెక్కిన జర్నలిస్టుల మనోగతాన్ని గ్రహించి ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వర్కింగు జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం చొరవ తీసుకోవాలని ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ డిమాండ్ చేసింది. ఆమేరకు ఐ.జే.యు. జాతీయ అధ్యక్షుడు బల్విందర్ సింగ్ జమ్మూ సెక్రెటరీ జనరల్ డి. సోమసుందర్ శనివారం ఒక ప్రకటన విడుదలచేశారు. గాంధీ జయంతి రోజున దేశవ్యాప్తంగా కోర్కెలదినం పాటించాలన్న ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ పిలుపు నకు అపూర్వ స్పందన లభించిందని వారు తెలిపారు. దేశంలోని పదిహేడు రాష్ట్రాల్లోని దాదాపు 350 కేంద్రాల్లో "కోర్కెలదినం" కార్యక్రమం విజయవంతంగా జరిగిందని వారా ప్రకటనలో పేర్కొన్నారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ వేలాదిమంది జర్నలిస్టులు వీధుల్లోకి వచ్చారనీ, ర్యాలీలు, ధర్నాలు , సభలు సమావేశాలు నిర్వహించారనీ మంత్రులకు, ప్రజాప్రతినిధులకు, ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందచేశారనీ ఆ ప్రకటనలో వివరించారు. దేశంలో ప్రస్తుత మీడియా స్థితిగతులను ధోరణులను అధ్యయనం చేయడానికి వీలుగా మీడియా కమిషన్ ను ఏర్పాటు చేయాలని, జర్నలిస్టుల భద్రతకు జాతీయ స్థాయిలో ఒక ప్రత్యేక చట్టం చేయాలని, 1955,1958 నాటి వర్కింగ్ జర్నలిస్ట్ చట్టాలను వెంటనే పునరుద్ధరించాలని, 2007 తర్వాత జర్నలిస్టులకు వేతన సవరణ జరగ నందున వెంటనే కొత్త వేజ్ బోర్డును ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా జర్నలిస్టులు డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆయా రాష్ట్రాల అనుబంధ సంఘాలు భారత రాష్ట్రపతికి పంపించాయని వారు వెల్లడించారు. వివిధ రాష్ట్రాల్లో జర్నలిస్టులు తాము ఎదుర్కుంటున్న స్థానిక సమస్యలను కూడా వినతి పత్రాలలో ప్రస్తావిస్తూ ప్రజా ప్రతినిధులకు, అధికారులకు అందచేశారు. సమస్యలు పరిష్కారం జరగని పక్షంలో తను ఉద్యమిస్తామని వారు స్పష్టం చేశారు. "కోర్కెల దినం" కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాలు పంచుకున్న వేలాది మంది జర్నలిస్టులను ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ జాతీయ అధ్యక్షుడు బల్విందర్ సింగ్ జమ్మూ , సెక్రెటరీ జనరల్ డి. సోమసుందర్ శనివారం విడుదల చేసిన ఒక మీడియా ప్రకటనలో అభినందించారు. ప్రణాళికా బద్ధంగా కార్యక్రమాన్ని జయప్రదం చేసిన ఐ.జే.యూ. అనుబంధ రాష్ట్ర సంఘాలకు వారు ధన్యవాదాలు తెలిపారు. ఐ.జే.యు. లేవనెత్తిన సమస్యలకు జర్నలిస్టుల నుంచి లభించిన స్పందనను గుర్తించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా తగు చర్యలు తీసుకోవాలని వారు ఆ ప్రకటనలో డిమాండ్ చేశారు.

# ఖైరతాబాద్ బరిలో కవిత పార్టీ




**హైదరాబాద్ :** ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్ వైపు అడుగులు వేసి ఎంపీగా పోటీ చేయడంతో ముంచుకొచ్చిన ఖైరతాబాద్ అసెంబ్లీ ఉపఎన్నిక తెలంగాణ రాజకీయాల్లో ఊహించని మలుపులు తిరుగుతోంది. బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చి, తెలంగాణ రక్షణ సేన పేరుతో కొత్త రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన కల్వకుంట్ల కవిత.. ఈ ఉపఎన్నిక బరిలో తమ పార్టీ అభ్యర్థిని దించుతామని ప్రకటించడం ప్రాధాన్యత సంతరించుకుంది. పార్టీ ఆవిర్భావం తర్వాత ఎదుర్కొంటున్న తొలి ఎన్నిక కావడంతో, ఖైరతాబాద్ పోరు తెలంగాణ రక్షణ సేనకు తమ ఉనికిని, క్షేత్రస్థాయి ప్రాభవాన్ని చాటుకునే ప్రతిష్టాత్మక పరీక్షగా మారనుంది. ఈ ఎన్నికల్లో కవిత నేతృత్వంలోని పార్టీకి ప్రధాన లక్ష్యం తక్షణమే సీటును కైవసం చేసుకోవడం కాకపోవచ్చు. ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల త్రిముఖ పోటీ మధ్య తమకంటూ ఒక ప్రత్యేకమైన ఓటు బ్యాంకు, సిద్ధాంతపరమైన స్థానం ఉందని నిరూపించుకోవడమే ఆమె అసలైన పొలిటికల్ ఎజెండాగా కనిపిస్తోంది. బిఆర్ఎస్ నుంచి సస్పెన్షన్, జైలు జీవితం తర్వాత "సామాజిక తెలంగాణ" నినాదంతో ప్రజాక్షేత్రంలోకి వచ్చిన కవితకు.. హైదరాబాద్ నడిబొడ్డున జరిగే ఈ బైపోల్ ఒక లిట్మస్ టెస్ట్ లాంటిది. ప్రధాన పార్టీలకు గట్టి పోటీ ఇస్తూ ఓట్లను రాబట్టగలిగితే, రాబోయే స్థానిక సంస్థలు, అసెంబ్లీ ఎన్నికలకు టీఆర్ఎస్‌ను ఒక ప్రత్యామ్నాయ శక్తిగా నిలబెట్టే అవకాశం దక్కుతుంది. ఖైరతాబాద్ నియోజకవర్గ భౌగోళిక, సామాజిక సమీకరణాలు పరిశీలిస్తే ఇక్కడ పోటీ అత్యంత విలక్షణంగా ఉంటుంది. బస్తీల్లో ఉండే శ్రామిక వర్గాలు, కాలనీల్లోని మధ్యతరగతి ప్రజలు, హైటెక్ ఉద్యోగులు, ఐటీ ఆధారిత వ్యాపారవేత్తలు, విద్యావంతులు పెద్ద సంఖ్యలో ఇక్కడ నివసిస్తున్నారు. స్థానికంగా మంచి పట్టుండి, ప్రజాదరణ పొందిన బలమైన అభ్యర్థిని బరిలోకి దించగలిగితే తెలంగాణ రక్షణ సేన ప్రధాన పార్టీల గెలుపోటములను ప్రభావితం చేసే కింగ్ మేకర్ గా మారే ప్రభావం చూపుతుంది. ఈ ఉపఎన్నికలో కవితకు అతిపెద్ద ప్లస్ పాయింట్ మహిళా ఓటర్లు. గతంలో తెలంగాణ జాగృతి ద్వారా బతుకమ్మ సంస్కృతిని విశ్వవ్యాప్తం చేయడం, మహిళా సాధికారత అంశాలపై పోరాడటం వల్ల తెలంగాణ సెంటిమెంట్‌తో పాటు మహిళల్లో ఆమెకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఖైరతాబాద్ వంటి అర్బన్ నియోజకవర్గంలో మహిళా ఓటర్ల శాతం అధికంగా ఉండటం వల్ల.. ధరల పెరుగుదల, ఉచిత బస్సు ప్రయాణాల అమలు తీరు, మహిళా భద్రత, స్థానిక సమస్యలపై ఆమె చేసే ప్రచారం మహిళల ఓట్లను ఆకర్షించే అవకాశం ఉంది. ఇది అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్‌ల సాంప్రదాయ మహిళా ఓటు బ్యాంకుకు గండికొట్టడం ఖాయంగా కనిపిస్తోంది. దానం నాగేందర్ పార్టీ మార్పు , రాజ్యాంగబద్ధమైన పదవుల దుర్వినియోగంపై కవిత తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. ఒక గుర్తుపై గెలిచి మరొక పార్టీకి వెళ్లడం ప్రజాస్వామ్యాన్ని పరిహసించడమే అని ప్రజల్లోకి తీసుకెళ్తూ, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, బీఆర్ఎస్ అంతర్గత ఒప్పందాలను ఒకేసారి ఎండగట్టే వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. రాజధాని నగరంలోని విద్యావంతులు, తటస్థ ఓటర్లు ప్రజాస్వామ్య సూత్రాలకు ప్రాధాన్యమిస్తే.. ఈ రాజకీయం కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండింటికీ తలనొప్పిగా మారనుంది. ఖైరతాబాద్ ఉపఎన్నిక ఫలితాల సరళిని తలకిందులు చేసే శక్తి తెలంగాణ రక్షణ సేనకు ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. గెలుపు ఓటముల కంటే కూడా, తాము సాధించే ఓట్ల శాతమే భవిష్యత్తులో తెలంగాణ రాజకీయాల్లో కవిత ఎంతవరకు ప్రభావం చూపగలరనే దానికి ప్రామాణికంగా నిలుస్తుంది. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు సైతం కవిత అభ్యర్థిత్వం , వ్యూహాలను తేలిగ్గా తీసుకోలేక, తమ ఓటు బ్యాంకును కాపాడుకునేందుకు కొత్త సమీకరణాలను తెరపైకి తెచ్చే పరిస్థితి ఏర్పడింది. ==

## పోలవరం నూతన డీఎస్పీగా యు. రవిచంద్ర బాధ్యతల స్వీకరణ



**పోలవరం,మీ వార్త అక్టోబర్ 3** పోలవరం సబ్ డివిజన్ నూతన డీఎస్పీగా యు. రవిచంద్ర శనివారం బాధ్యతలు స్వీకరించారు. సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడతామని తెలిపారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్ట భద్రతా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజల ప్రాణ, ఆస్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. రౌడీషీటర్లు, చెడు నడక కలిగిన వ్యక్తులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై ప్రత్యేక నిఘా ఉంచుతామని వెల్లడించారు. ప్రజలకు పోలీసులపై మరింత నమ్మకం కలిగేలా విధులు నిర్వహిస్తామని తెలిపారు. అనుమానాస్పద, అసాంఘిక కార్యకలాపాలు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

## వినాయక నిమజ్జనంలో పాల్గొన్న వైఎస్సార్సీపీ ఇంఛార్జ్ వడ్డీ రఘురాం నాయుడు



**తాడేపల్లిగూడెం, అక్టోబర్ 03 (మీ వార్త ప్రతినిధి)** తాడేపల్లిగూడెం పట్టణంలోని 15వ వార్డు సవిత్రిపేటలో గూడ బాబి ఉ శశి వారి మిత్ర మండలి సభ్యులు నిర్వహించిన శ్రీశ్రీశ్రీ వరసిద్ధి వినాయక చవితి మహోత్సవాల సందర్భంగా నిర్వహించిన వినాయక నిమజ్జన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జ్ వడ్డీ రఘురామ్ నాయుడు పాల్గొని వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలు, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అమెరికాలో విషాదం..

## అనారోగ్యంతో నల్గొండ యువతి మృతి

**మిర్యాలగూడ :** ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన తెలుగు యువతి తీవ్ర అనారోగ్యానికి గురై దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందింది. క్యాన్సర్ మహమ్మారితో పోరాడి కన్నుమూసింది. నల్గొండ జిల్లా వేములపల్లి మండలం మొల్కపట్నం గ్రామానికి చెందిన బాధితురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. పీఏసీఎస్ సల్కునూరు మాజీ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి కందిమల్ల లక్ష్మిరెడ్డి, పద్మ దంపతుల చిన్న కుమార్తె మాన్వితా రెడ్డి (26) హైదరాబాద్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది. ఉన్నత చదువుల కోసం 2023లో అమెరికా వెళ్లింది. స్నేహితులతో కలిసి ఉంటూ ఎంఎస్ పూర్తి చేసింది. ఈ క్రమంలో ఆమె అనారోగ్యానికి గురైంది. సెప్టెంబర్ 4న అకస్మాత్తుగా తీవ్ర గొంతు నొప్పితో అనారోగ్యానికి గురికావడంతో స్నేహితులు ఆమెను బాల్టిమోర్‌లోని దవాఖానలో చేర్పించారు. వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఆమెకు నాలుగో దశ క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారించారు. సెప్టెంబర్ 13న చికిత్స కోసం దవాఖానలో ఇన్ పేషెంట్‌గా చేర్చుకున్నారు. అప్పటి నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఈ క్రమంలో ఆరోగ్య పరిస్థితి విషమించడంతో అక్టోబర్ 1న మాన్వితారెడ్డి మృతిచెందింది.

## ఇద్దరు పిల్లలతో కలిసి బావిలో దూకి తల్లి ఆత్మహత్య

**వికారాబాద్ జిల్లా పూడూరు మండలంలో విషాద ఘటన**

**వికారబాద్** మాటుగూడలో కుటుంబ కలహాల నేపథ్యంలో శుక్రవారం ఉదయం భర్త రాజుతో గొడవ పడి కూతురు జనశ్రీ (8), కుమారుడు సాకేత్ (4)లను తీసుకుని ఇంట్లో నుంచి వెళ్లిపోయి సోమనుర్తి శివారులోని వ్యవసాయ బావిలో దూకి శవమై భార్య మమత (30) కనిపించింది. ఇద్దరి మృతదేహాలను బయటకు తీయగా, సాకేత్ కోసం పోలీసులు గాలిస్తునారు.

## శ్రీసిటీలో ఘోర ప్రమాదం.. నలుగురు మృతి

తిరుపతి : తిరుపతి జిల్లా శ్రీసిటీలోని ఓ పరిశ్రమలో శనివారం భారీ పేలుడు సంభవించింది. టిల్ హెల్త్కేర్ పరిశ్రమలో బాయిలర్ ఒక్కసారిగా పేలడంతో ఇద్దరు కార్మికులు మృతి చెందారు. పరిశ్రమలోని నిర్మాణాలు, ఇనుప సామగ్రి, పైపులు, ఇతర పరికరాలు దెబ్బతిన్నాయి. ఘటనాస్థలంలో భారీగా శిథిలాలు చెల్లాచెదురుగా పడ్డాయి. శిథిలాల కింద పలువురు కార్మికులు చిక్కుకుపోయినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదంలో మృతిచెందిన వారు, గాయపడిన వారి వివరాలు, వారి స్వస్థలాలు, క్షతగాత్రుల పరిస్థితిపై అధికారులు పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది. అలాగే బాయిలర్ పేలుడుకు గల అసలు కారణం ఏమిటన్న దానిపై అధికారులు పరిశీలన చేస్తున్నారు.

## చేనేత వస్త్రప్రదర్శనను ప్రారంభించిన సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన

**హైదరాబాద్** మన చేనేతకళలను మనమే ప్రోత్సహించాలని, చేనేత వస్త్రాలు ప్రతిఒక్కరూ తప్పనిసరిగా భాద్యతగా ధరించాలని సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ జి.సృజన అన్నారు. శ్రీనగర్ కాలనీ సత్యసాయి నిగమాగమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీ పేరుతో ఏర్పాటుచేసిన చేనేత వస్త్రప్రదర్శనను ఆమె ప్రారంభించారు. దసరా, బతుకమ్మ, దీపావళితో పాటు పలు శుభకార్యాలకు అనువుగా ఇక్కడ చేనేత కళాకారుల చీరలు కొలువుదీరాయని, చేనేత కళాకారులకు మరింత ఆదరణ లభించాలని ఆకాంక్షించారు. సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా చేనేత వస్త్రకళలు నిలుస్తాయని, భారతీయ వస్త్రాలకు అంతర్జాతీయంగా ప్రాచుర్యం ఉందన్నారు. చేనేతకారులకు మరింత ప్రోత్సాహం అందించడానికి, వారి ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు చేరాలనే సదుద్దేశంతో ఈ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటుచేసిన నిర్వాహకులు శ్రీనివాసరావు, వినయ్‌కుమార్‌ల కృషిని అభినందించారు. వస్త్రప్రదర్శనలోని వస్త్రాలను తిలకించి చేనేతకారులను ప్రశంశించారు. ప్రముఖ నగరాలకు చెందిన చేనేతకారులు తమ ఉత్పత్తులైన సిల్క్, కాటన్, డిజైనరీ వస్త్రాలను సుమారుగా 80స్టాల్స్ ప్రదర్శిస్తున్నట్లు నిర్వాహకులు శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల11వరకు ఈ ఎగ్జిబిషన్ వినియోగదారులకు అందుబాటులో ఉంటుందన్నారు.

## హ్యాండీ క్రాఫ్ట్ మేళాను ప్రారంభించిన ఎమ్మెల్యే మాధవరం

**హైదరాబాద్ :** దేశంలోని వివిధ రాష్ట్రాల సంప్రదాయ చేనేత వస్త్రాలు, హస్తకళలను ఒకే

# శ్రీవిష్ణు 'కామ్రేడ్ కళ్యాణ్' టైటిల్ సాంగ్ విన్నారా..?



శ్రీ విష్ణు హీరోగా వస్తోన్న లేటెస్ట్ మూవీ కామ్రేడ్ కల్యాణ్. ఈ సినిమాకు జానకీరామ్ మారెళ్ల దర్శకత్వం వహిస్తున్నారు. ఈమూవీ అక్టోబరు 9న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ మూవీలో మహిమా నంబియార్ హీరోయిన్‌గా కనిపించనుంది. ఈ చిత్రాన్ని స్కంద వాహన మోషన్ పిక్చర్స్ ఎల్ఎల్‌పీ అండ్ కోన ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్లపై వెంకట కృష్ణ కర్నాటి, సీతా కర్నాటి నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ మూవీ నుంచి పలు పాటలను విడుదల చేశారు. తాజాగా టైటిల్ సాంగ్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. విజయ్ బుల్గానిన్ స్వరాలు సమకూర్చిన ఈ పాటకు భాస్కరభట్ల సాహిత్యం అందించారు. రాహుల్ సిప్లిగంజ్ ఆలపించారు. కాగా ఈ చిత్రంలో రాధిక శరత్‌కుమార్, షైన్ టామ్ చాకో, ఉపేంద్ర లిమాయే కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## రెండు వారాల గ్యాప్‌లో సాయిపల్లవి రెండు పాన్ ఇండియా సినిమాలు.. హీరోయిన్‌కు ప్లస్సా? నిర్మాతలకు రిస్కా?

ఒక సినిమా కోసం ప్రేక్షకులు ఎదురుచూస్తున్న సమయంలోనే అదే హీరో లేదా హీరోయిన్ నటించిన మరో సినిమా థియేటర్లలోకి వస్తే పరిస్థితి ఎలా ఉంటుంది? సాధారణంగా ఒకే నటుడి సినిమాలు తక్కువ గ్యాప్‌లో విడుదలైతే బాక్సాఫీస్ పరంగా పోటీ నెలకొనే అవకాశం ఉంటుంది. అయితే స్టార్ హీరోయిన్ సాయిపల్లవి విషయంలో ఇప్పుడు ఇదే పరిస్థితి కాస్త ఆసక్తికరంగా మారింది. ఆమె నటించిన రెండు భారీ పాన్ ఇండియా చిత్రాలు కేవలం రెండు వారాల వ్యవధిలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. సాయిపల్లవికి ఇది నటిగా మంచి అవకాశంగా కనిపిస్తున్నప్పటికీ, రెండు సినిమాల నిర్మాతలకు మాత్రం థియేటర్ల కేటాయింపు, ప్రచార కార్యక్రమాలు, ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించడం వంటి అంశాల్లో సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. రణబీర్ కపూర్ రాముడిగా, సాయిపల్లవి సీతాదేవిగా, యష్ రావణుడిగా నటిస్తున్న భారీ చిత్రం 'రామాయణ: పార్ట్ 1'. నితేష్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. భారతీయ ఇతిహాసం రామాయణం ఆధారంగా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో భారీగా విడుదల చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. నవంబర్ 6న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో సాయిపల్లవి సీత పాత్రలో కనిపించనుండటంతో ఆమె పాత్రపై కూడా భారీ ఆసక్తి నెలకొంది. 'రామాయణ: పార్ట్ 1' విడుదలైన సరిగ్గా రెండు వారాల తర్వాత సాయిపల్లవి నటించిన మరో భారీ చిత్రం 'ఓం: చాప్టర్ 1 -- ఉదిరం' థియేటర్లలోకి రానుంది. ధనుష్ హీరోగా నటిస్తున్న ఈ సినిమాకు 'అమరన్' ఫేమ్ రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో మమ్ముట్టి, శ్రీలీల తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సాయిపల్లవి కూడా కథలో ప్రాధాన్యత ఉన్న పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. ఆమె పాత్రలో యాక్షన్, భావోద్వేగాలకు ప్రాధాన్యత ఉంటుందని ప్రచారం జరుగుతోంది. రెండు సినిమాల మధ్య కేవలం 14 రోజుల గ్యాప్ ఉండటంతో థియేటర్ల కేటాయింపు విషయంలో కొంత ప్రభావం పడే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. ముఖ్యంగా 'రామాయణ: పార్ట్ 1'కు భారీ స్పందన వచ్చి ఎక్కువ కాలం థియేటర్లలో కొనసాగితే, రెండు వారాల తర్వాత విడుదలయ్యే 'ఓం: చాప్టర్ 1 -- ఉదిరం'కు థియేటర్లు సర్దుబాటు చేయడం కొంత సవాలుగా మారవచ్చు.. అయితే ఈ రెండు సినిమాలు సాయిపల్లవికి ఒక విషయంలో ప్రత్యేకమైన అవకాశాన్ని ఇవ్వనున్నాయి.





# 'జైలర్ 2' కోసం తప్పుకున్న ధనుశ్.. 'ఓం చాప్టర్ 1' కొత్త విడుదల తేదీ ఖరారు!

కోలీవుడ్ స్టార్ హీరో ధనుశ్, లెజెండరీ నటుడు మమ్ముట్టి ప్రధాన పాత్రలలో నటిస్తున్న తాజా చిత్రం 'ఓం చాప్టర్ 1'. ఈ సినిమా విడుదల తేదీని తాజాగా ప్రకటించింది చిత్రయూనిట్. ఈ సినిమాను నవంబర్ 20, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ స్పష్టం చేశారు. ఈ చిత్రానికి రాజ్‌కుమార్ పెరిసామి దర్శకత్వం వహిస్తున్నారు. ముందుగా అనుకున్న ప్రకారం ఈ సినిమా అక్టోబర్ 16న ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉంది. అయితే సూపర్ స్టార్ రజినీకాంత్ నటించిన భారీ బడ్జెట్ చిత్రం 'జైలర్ 2' అక్టోబర్ 15న విడుదలవుతుండటంతో, రజినీకాంత్ పై ఉన్న అపారమైన గౌరవంతో ధనుశ్ ఈ సినిమా విడుదల తేదీని వాయిదా వేస్తున్నట్లు గతంలోనే ప్రకటించారు. రూ. 600 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన 'జైలర్' చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న 'జైలర్ 2'తో బాక్సాఫీస్ వద్ద పెద్ద ఎత్తున క్లాష్ ఏర్పడకుండా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చిత్ర బృందం తెలిపింది. రజినీకాంత్ సినిమాతో పాటు, దీపావళి బరిలో నిలవాలని భావించిన హిందీ చిత్రం 'రామాయణ పార్ట్ వన్' మరియు సూర్య నటిస్తున్న 'సీన్' సినిమాలతో కూడా ఎలాంటి పోటీ లేకుండా ఉండేందుకే ఈ నవంబర్ తేదీని లాక్ చేసినట్లు వెల్లడించారు. పరిశ్రమలో పెద్ద సినిమాలు ఒకరి నిర్ణయాలను మరొకరు గౌరవించుకోవాలని, పరస్పర అవగాహనతో ముందుకు వెళ్లాలని ధనుశ్ అభిప్రాయపడ్డారు. రాజ్‌కుమార్ పెరిసామి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో సాయి పల్లవి, శ్రీలీల, నసీరుద్దీన్ షా తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకు సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తుండగా, ఎజిల్ అరసు కె. సినిమాటోగ్రఫీ, ఆర్. కలైవనన్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. శ్రద్ధా అగర్వాల్, ధనుశ్, అజ్మత్ జగ్మగ్ సంయుక్తంగా వండర్ బార్ ఫిల్మ్స్, ఆర్ టేక్ స్టూడియోస్ పతాకాలపై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

# ఆ నీచులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టను: ఎన్టీఆర్ వార్నింగ్



గత కొన్ని గంటలుగా సోషల్ మీడియాలో 'చుట్టమల్లే'(దేవర సినిమా) పాట తెగ వైరల్ అవుతుంది. ఏఐ ద్వారా అత్యంత నీచంగా ఎడిట్ చేసిన ఈ వీడియోని కొంతమంది సోషల్ మీడియాలో షేర్ చేస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నారు. అలాంటివారిపై హీరో ఎన్టీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఏఐ ద్వారా ఎడిట్ చేసిన ఆ వీడియోని షేర్ చేసిన వారిపై లీగల్ యాక్షన్ తీసుకుంటామని హెచ్చరించాడు. ఒక ఆడపిల్లను అత్యంత అవమానకరంగా చూపేందుకు ఏఐని ఉపయోగించడం సిగ్గు చేటు అని.. ఎట్టిపరిస్థితుల్లోనూ వారిని వదిలిపెట్టబోనని హెచ్చరించాడు. ఈ మేరకు ఎక్స్‌లో సుధీర్ఘమైన పోస్ట్ పెట్టాడు.

'మహిళలను తల్లులుగా, దేవతలుగా గౌరవించే దేశంలో.. 'మాతృదేవోభవ' అనేది కేవలం ఒక మాట మాత్రమే కాదు, మన సంస్కృతిలో భాగం. అలాంటి సమాజంలో కొందరు ఇంత దిగజారి.. ఒక మహిళను అత్యంత అవమానకరంగా చూపించేందుకు ఏఐ (ూ×) సాంకేతికతను దుర్వినియోగం చేయడం తీవ్రంగా ఖండించాల్సిన విషయం. ఇలాంటి దారుణమైన మార్ఫింగ్ వీడియోను రూపొందించేందుకు ఏఐని ఉపయోగించడం సిగ్గుచేటు. 'చుట్టమల్లే' వీడియోను మార్ఫింగ్ చేసి, అసభ్యకరంగా రూపొందించిన ఆ నీచులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టను. ఈ వీడియోను రూపొందించిన వారితో పాటు దాన్ని సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్న వారిపై కూడా అన్ని రకాల చట్టపరమైన చర్యలు తీసుకుంటాను. దయచేసి ఇలాంటి కంటెంట్‌ను ఎవరూ చూడొద్దు.. షేర్ చేయొద్దు.. ఎంగేజ్ అవ్వొద్దు అని విజ్ఞప్తి చేస్తున్నాను. ఈరోజు బాధితురాలు మరొకరు కావచ్చు.. రేపు అది మీ తల్లి, సోదరి, భార్య లేదా కుమార్తె కావచ్చు. ఇది చాలా తీవ్రమైన సమస్య. ఏఐ సాంకేతికత దుర్వినియోగాన్ని అరికట్టేందుకు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు కేంద్రం కూడా కఠినంగా వ్యవహరించాలని, పటిష్ఠమైన నిబంధనలు తీసుకురావాలని కోరుతున్నాను' అని ఎన్టీఆర్ ట్వీట్ చేశాడు.

# అల్లు అర్జున్ 'రాకా'లో ఐశ్వర్య లక్ష్మి లేదా .. క్లారిటీ ఇచ్చిన హీరోయిన్

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ 'రాకా'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. అల్లు అర్జున్ కెరీర్‌లోనే అత్యంత భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాను అంతర్జాతీయ స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకునేలా తెరకెక్కిస్తున్నట్లు చిత్రబృందం చెబుతోంది. దీంతో సినిమా కథ, నటీనటులు, సాంకేతిక నిపుణులకు సంబంధించిన ప్రతి అప్‌డేట్‌పై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా ఈ సినిమాలో అల్లు అర్జున్ సరసన పలువురు ప్రముఖ కథానాయికలు కనిపించనున్నారనే వార్తలు కొంతకాలంగా వినిపిస్తున్నాయి. దీపికా పదుకొణె, రష్మిక మందన్న, మృణాల్ ఠాకూర్ వంటి పేర్లు ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌తో ముడిపడి ప్రచారంలో ఉన్నాయి. ఈ క్రమంలో మరో హీరోయిన్ పేరు కూడా తెరపైకి వచ్చింది. మలయాళంతో పాటు తెలుగు, తమిళ సినిమాల్లోనూ గుర్తింపు తెచ్చుకున్న ఐశ్వర్య లక్ష్మి 'రాకా'లో నటించబోతున్నారంటూ ఇటీవల సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. ఈ వార్త అభిమానుల్లోనూ ఆసక్తిని పెంచింది.అయితే తాజాగా ఈ ప్రచారంపై ఐశ్వర్య లక్ష్మి స్వయంగా స్పందించింది. తాను 'రాకా' సినిమాలో భాగం కాదని ఆమె స్పష్టం చేసింది. అంతేకాదు, తనను ఎవరైనా ఈ సినిమాలో చేర్చాలని సరదాగా స్పందించడం ఆసక్తికరంగా మారింది. దీంతో ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం ఐశ్వర్య లక్ష్మి 'రాకా' తారాగణంలో లేరని భావించవచ్చు. అయితే సినిమా విడుదలకు ఇంకా సమయం ఉండటంతో భవిష్యత్తులో తారాగణానికి సంబంధించి మరిన్ని అధికారిక ప్రకటనలు వచ్చే అవకాశం ఉంది. అల్లు అర్జున్, అట్లీ కలయికలో వస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. అట్లీ గతంలో భారీ కమర్షియల్ అంశాలతో సినిమాలను తెరకెక్కించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఇప్పుడు అల్లు అర్జున్‌తో కలిసి చేస్తున్న ఈ ప్రాజెక్ట్‌ను మరింత భారీ స్థాయిలో రూపొందిస్తున్నట్లు సమాచారం. సినిమాలో పలువురు ప్రముఖ నటీనటులు భాగం కానున్నారనే ప్రచారం సాగుతోంది. ముఖ్యంగా కథకు అనుగుణంగా ఒకటి కంటే ఎక్కువ కీలక మహిళా పాత్రలు ఉండనున్నాయని, వాటి కోసం స్టార్ హీరోయిన్లను తీసుకుంటున్నారని టాక్ వినిపిస్తోంది. అయితే పూర్తి తారాగణంపై చిత్రబృందం అధికారికంగా ప్రకటించే వరకు ప్రచారంలో ఉన్న పేర్లను నిర్ధారించలేం.'రాకా' సినిమాకు సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తున్నారు.

